J/NELLORE/003/21-23 R.N.I.No.25359/74 పేజీలు : 12

THE BEST TELUGU WEEKLY OF NELLOREANS




# లాయర్

సంపుటి : 41 సంచిక : 40 11.3.2022, శుక్రవారం వెల : రూ. 5 /- వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంపాదకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి

### కమల దళంలో...


# ఉరికే ఉత్సాహం.. ఉత్తరాన ప్రోత్సాహం

- భాజపా ఖాతాలో ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్, మణిపూర్
- పంజాబ్‌లో పాగా వేసిన ఆమ్ ఆద్మీ
- గోవాలో సస్పెన్స్
- ఎక్కడా కానరాని కాంగ్రెస్
- ఇక తెలుగు రాష్ట్రాలపై భాజపా దృష్టి
- తెలంగాణలో టార్గెట్ కేసీఆర్
- ఆంధ్రాలో ఆచితూచి అడుగు



**మూ**డునెలలుగా దేశవ్యాప్తంగా జరుగుతున్న చర్చకు తెరపడింది. అయిదు రాష్ట్రాలలో జరిగే ఎన్నికలలో రాబోయే ఫలితాలపై భారతీయ జనతా పార్టీ భవిష్యత్తు ఆధారపడి ఉందని భావిస్తున్న వారందరికీ సమాధానం దొరికింది. అయిదులో నాలుగు రాష్ట్రాలలో కమలం విరిసింది.. కమలదళం మురిసింది.

రెండు రాష్ట్రాలను పూర్తి ఆధిక్యతతో బీజేపీ కైవసం చేసుకుంది. ముఖ్యంగా ఉత్తరప్రదేశ్‌లో 403 సీట్లకుగాను 268 సీట్లు సాధించి తన సత్తా చూపించింది. ఉత్తరాఖండ్‌లో కూడా 70 సీట్లకు గాను 47 సీట్లను తన ఖాతాలో వేసుకుంది. మణిపూర్‌లో పోటాపోటీగా పరువు నిలుపుకుంది. పంజాబ్‌లో ఊహించిన విధంగానే ఆమ్ ఆద్మీ పార్టీ పాగా వేసింది. ఇక్కడ 117 సీట్లకుగాను 92 సీట్లలో ఆప్ విజయం సాధిస్తుందని మాత్రం ఊహించలేదు. పంజాబ్‌లో కాంగ్రెస్ అధ్యక్షుడు సిద్ధూ కాంగ్రెస్‌కు గుదిబండగా మారడం ఖాయం అంటూ వెలువడిన విశ్లేషణలు




3లో



## ఇదీ నెల్లూరు

### అడుగడుగునా అక్రమ నిర్మాణాలు, మురుగు గుంటలుగా మారిన ఖాళీ స్థలాలు, కోట్లకొద్దీ పుట్టుకొస్తున్న దోమలు, గుంతలమయమైన రోడ్లు, అస్తవ్యస్తమైన ట్రాఫిక్‌తో అవస్త... అచేతనంగా అధికార వ్యవస్థ

10లో

# నగరం కాదు నరకం

### నడ్డి విరిచే వడ్డీతో పన్నుల కలెక్షన్.. వసూళ్ళలో టాప్ - వసతులలో ఫ్లాప్



### చెంగాళమ్మ దేవస్థానం ఛైర్మెన్‌గా

# మళ్ళీ.. దువ్వూరు బాలచంద్రారెడ్డి


దువ్వూరు బాలచంద్రారెడ్డి

తెలుగు–తమిళ ప్రజల ఆరాధ్యదైవమైన సూళ్ళూరుపేట శ్రీ చెంగాళ పరమేశ్వరి అమ్మవారి దేవస్థానం ఛైర్మెన్‌గా రెండోసారి దువ్వూరు బాలచంద్రారెడ్డిని నియమిస్తూ రాష్ట్ర దేవాదాయశాఖ తాజాగా ఉత్తర్వులిచ్చింది. ఆలయానికి కొత్త పాలకమండలిని నియమిస్తూ ఇటీవల ఉత్తర్వులు వచ్చాయి. సభ్యులుగా ముప్పాళ్ళ చంద్రశేఖర్‌రెడ్డి, వంకా వెంకటదినేష్‌కుమార్, కర్లపూడి సురేష్‌బాబు, బండి సుజాత, ఓలేటి బాలసత్యనారాయణ, మన్నెముద్దు పద్మజ, నాయుడుకుప్ప నాగమణి, పెనుబేటి మారమ్మ నియమితులయ్యారు. ఎక్స్ అఫిషియో సభ్యులుగా కీసరవల్లి నరేంద్రను నియమించారు. తమను బోర్డు సభ్యులుగా నియమించేందుకు కృషిచేసిన సూళ్ళూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్యకు పాలకమండలి సభ్యులు కృతజ్ఞతలు చెప్పారు.

# మునిసిపల్ కార్మికుల దీక్షలు


మోకాళ్లపై నిల్చుని ఆందోళన చేస్తున్న మునిసిపల్ కార్మికులు

తమ న్యాయమైన సమస్యలు తీర్చాలంటూ నెల్లూరు కలెక్టరేట్ వద్ద మునిసిపల్ కార్మికులు ఇటీవల రిలేదీక్షలు చేపట్టారు. మోకాళ్లపై నిల్చుని తమ డిమాండ్ల సాధన కోసం ఆందోళన చేశారు. ఏపి మునిసిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా కార్యదర్శి కె. పెంచలనరసయ్య మాట్లాడుతూ మునిసిపల్ కార్మికులుగా పనిచేస్తున్న వారంతా అధికశాతం మంది దళితులు, గిరిజనులేనని, ప్రభుత్వం వారి సమస్యలు తీర్చి ఆదుకోవాలని కోరారు. చాలీచాలని జీతాలతో కార్మికులు ఎంతోకాలం నుంచి అవస్తలు పడుతున్నారని, వారికి ఎలాంటి రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ లేకపోవడం విచారకరమన్నారు. 11వ పిఆర్‌సిలో కార్మికులకు ఎలాంటి న్యాయం జరగలేదన్నారు. ఔట్‌సోర్సింగ్ కార్మికులను రెగ్యులర్ చేయాలన్నారు. ఈ దీక్షల్లో సిపిఎం నాయకులు అల్లాడి గోపాల్, పద్మనాభయ్య, సుజాత, వజ్రమ్మ, మహేంద్ర, రాజగోపాల్, పోలయ్య పాల్గొన్నారు.

# పాపకర్మలను దూరంచేసే.. గరుడ పురాణం


కోట కృష్ణమూర్తి

మన ప్రాచీన మహర్షులు రచించిన గరుడ పురాణాన్ని పఠించడం ద్వారా పాపకర్మలు నివారణ అవుతాయని ప్రముఖ ఆధ్యాత్మికవేత్త కోట కృష్ణమూర్తి చెప్పారు. ఇటీవల ఆయన నగరంలోని ఫతేఖాన్ పేటలో ఉన్న రామమందిరంలో గరుడపురాణం విశిష్టతపై ఆధ్యాత్మికోపన్యాసం చేశారు. గరుడ పురాణం పఠనం లేదా వినడం వల్ల ఈ కలియుగంలో మనం చేసుకున్న పాపాలు సమసిపోతాయని వివరించారు.

### పొదలకూరు ఎంపిపి

# విజయమ్మ.. హఠాన్మరణం

**- నివాళులర్పించిన ఎమ్మెల్యే కాకాణి**



పొదలకూరు మండల పరిషత్ అధ్యక్షురాలు నిమ్మళ్ళ విజయమ్మ (34) ఇటీవల గుండెపోటుతో హఠాన్మరణం చెందారు. గత ఏడాది జరిగిన ఎన్నికల్లో వైకాపా తరఫున ఆమె ఆర్‌వైపాళెం ఎస్టీ జనరల్ సెగ్మెంట్ నుంచి పోటీచేసి 1662 ఓట్లతో ఘనవిజయం సాధించారు. ఆమె స్వస్థలం పులికల్లు. అస్వస్తతకు గురైన ఆమెను భర్త మణి ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతిచెందారు. వారికి 6–9 తరగతులు చదువుతున్న ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఆమె మరణంతో కుటుంబం శోకసాగరంలో మునిగిపోయింది. సర్వేపల్లి ఎమ్మెల్యే కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఆ గ్రామానికి వెళ్ళి విజయమ్మ భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఆమె భర్త మణిని, పిల్లలు భవాని, అనూషాలను ఓదార్చారు. ఎంపిపి పదవిని చేపట్టిన ఆరునెలలలోపే విజయమ్మ మృతి చెందడం బాధాకరమని విచారం వ్యక్తంచేశారు. ఆ కుటుంబానికి అండగా ఉంటామన్నారు.

### మల్లాం సుబ్రహ్మణ్యేశ్వరునికి

# 2.61 లక్షల హుండీ రాబడి

జిల్లాలోని ప్రముఖ దేవాలయమైన చిట్టమూరు మండలం మల్లాంలోని శ్రీ సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవాలయంలో ఇటీవల హుండీ లెక్కింపు జరిగింది. 5నెలలకు హుండీ ద్వారా 2.61,432 రూపాయలు ఆదాయం లభించినట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఆలయ ఛైర్మెన్ చిల్లకూరు కోదండరామిరెడ్డి, దేవాదాయశాఖ ఇన్స్‌పెక్టర్ సుధీర్‌బాబు, ఇఓ శశాంక్ తదితరులు ఈ లెక్కింపును పర్యవేక్షించినట్లు వారు పేర్కొన్నారు.

### దొరవారిసత్రం తహశీల్దార్‌గా

# గౌతమ్‌రెడ్డి ఓఎస్డీ

ఇటీవల దాకా మంత్రి మేకపాటి గౌతమ్‌రెడ్డి ఓఎస్డీగా పనిచేస్తున్న చెన్నయ్యను దొరవారిసత్రం తహశీల్దారుగా బదిలీచేస్తూ జిల్లా కలెక్టర్ కెవిఎన్ చక్రధర్ బాబు ఇటీవల ఉత్తర్వులిచ్చారు.

# జీతాలు పెంచి ఆదుకోండి

### 'ఉపాధి హామీ' ఫీల్డు అసిస్టెంట్ల అభ్యర్థన

రాష్ట్రంలో ఉపాధి హామీ పథకం ద్వారా పేదలకు పనులు కల్పించడంతో పాటు వారికి సామాజిక చైతన్యం కలిగించేందుకు నిరంతరం శ్రద్ధ తీసుకుంటున్న ఫీల్డ్ అసిస్టెంట్లు ఎంతో కాలంగా చాలీచాలని జీతాలతో ఇబ్బందులు పడుతున్నారని, నానాటికీ నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశానికంటుతున్నా జీతాలు మాత్రం పెంచడం లేదని ఫీల్డ్ అసిస్టెంట్ల యూనియన్ కోవూరు మండలశాఖ అధ్యక్ష కార్యవర్గ సభ్యులు పి.కిషోర్, జి.రమేష్‌లు ఆవేదన వ్యక్తం చేశారు. ఫీల్డ్ అసిస్టెంట్లకు కనీసవేతనం రూ.26 వేలు ఇవ్వాలని, ఉద్యోగభద్రత కల్పించాలని వారు డిమాండ్ చేశారు. అనంతరం ఎంపిడిఓకు తమ సమస్యల వినతిపత్రాన్ని సమర్పించారు. అసోసియేషన్ కార్యదర్శి కె.తిరుమలరావు, కోశాధికారి వెంకటరమణయ్య, కార్యవర్గ సభ్యులు శ్రీనివాసులు, ప్రసాద్ ఎస్‌కె మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

### చిరువ్యాపారులకు

# గొడుగులు వితరణ



కావలి పట్టణంలోని సుమారు వందమంది రోడ్డుమార్జిన్ వ్యాపారులకు ఈ వేసవిలో ఎండతో ఇబ్బందిలేకుండా ఐఎంఏ మాజీ అధ్యక్షుడు, కావలి రూరల్ ఆర్యవైశ్యసంఘం నాయకుడు డాక్టర్ మనోహర్‌బాబు ఇటీవల గొడుగులను ఉచితంగా పంచిపెట్టారు. తన జన్మదినోత్సవం సందర్భంగా ఆయన తన సొంత డబ్బులతో ఈ సేవా కార్యక్రమం నిర్వహించారు. ఆర్యవైశ్య సంఘం నాయకులు పాదర్తి నాగరాజు, ఓరుగంటి రామకృష్ణ, వేణు, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

# పార్టీని బలోపేతం చేస్తాం

### 'జనసేన' నాయకుడు మనుక్రాంత్



పార్టీలోని నాయకులు, కార్యకర్తలందరి సహకారంతో క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేస్తామని, పార్టీ అనుబంధ సంఘాల అభివృద్ధికి కృషిచేస్తామని జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు చెన్నారెడ్డి మనుక్రాంత్‌రెడ్డి చెప్పారు. జనసేన సభ్యత్వం తీసుకుంటే 5 లక్షల రూపాయల బీమా సౌకర్యం లభిస్తుందన్నారు. ఇటీవల ఆయన నెల్లూరులోని మహాత్మా జ్యోతిరావ్‌పూలే విగ్రహం వద్ద జరిగిన జనసేన క్రియాశీలక సభ్యత్వాల నమోదు కార్యక్రమంలో పాల్గొన్నారు. వైకాపా ప్రభుత్వ పాలనలో రాష్ట్రాభివృద్ధి అంధకారంగా మారుతోందని, రాష్ట్రాన్ని అప్పులపాలు చేసిన ఘనత వైకాపాదేనని ఆయన ఈ సందర్భంగా విమర్శించారు. రానున్న ఎన్నికల్లో వైకాపాకు గుణపాఠం చెప్పాలంటే జనసేనను బలోపేతం చేయాలన్నారు. జనసేన రాష్ట్ర నాయకుడు కొట్టే వెంకటేశ్వర్లు మాట్లాడుతూ దేశరాజకీయాల్లోనే ఎక్కడా లేనివిధంగా తమపార్టీలోని కార్యకర్తలకు మేలుచేయాలనే ఉద్దేశంతోనే జనసేన నేత పవన్‌కల్యాణ్ బీమా పథకాన్ని అమలుచేస్తున్నారని, ప్రతి కార్యకర్తకు ప్రమాదబీమా కూడా వర్తించేవిధంగా సభ్యత్వ నమోదులోనే ఏర్పాటుచేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు గునుకుల కిషోర్, దుగ్గిశెట్టి సుజయ్‌బాబు, ప్రశాంత్‌గౌడ్, పసుపులేటి హరి తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోళ్ళలో సమస్యలు తీర్చండి

### జేసీకి రైతుసంఘాల నాయకుల వినతి



జిల్లాలో ప్రస్తుత వ్యవసాయ సీజన్‌కు సంబంధించి చేస్తున్న ధాన్యం కొనుగోళ్ళను పటిష్టంగా నిర్వహించేలా చూడాలని జిల్లా రైతు సంఘాల సమాఖ్య ప్రతినిధులు ఇటీవల జిల్లా జాయింట్ కలెక్టర్ హరీందరప్రసాద్‌ను కలసి విన్నవించారు. ధాన్యం కొనుగోళ్ళు సక్రమంగా జరగడం లేదని, జిల్లాలో రైతులకు గిట్టుబాటు ధర ఇచ్చేందుకు రైతుభరోసా కేంద్రాల ద్వారా జిల్లావ్యాప్తంగా కొనుగోలు కేంద్రాలు సిద్ధంగా ఉన్నాయని అధికారులు చెప్తున్నా, కొన్ని చోట్ల మాత్రమే వాటిని ఏర్పాటు చేశారే తప్ప పూర్తిస్థాయిలో ఏర్పాటు కాలేదన్నారు. అక్కడ కూడా స్లిప్‌ల ద్వారా ధాన్యాన్ని మిల్లులకు పంపుతున్నారని, ట్రక్‌షీట్ లేకుండా రైస్‌మిల్లులకు ధాన్యం పంపితే బిల్లులు చెల్లింపు విషయం తమకు సంబంధం లేదని పౌరసరఫరాల సంస్థ వారు చెప్తుండడంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారని వారు జేసీకి తెలియజేశారు. పొరపాట్లు సరిదిద్దాలని, ధాన్యం కొనుగోళ్ళ అంశంలో ఉన్న సమస్యలన్నిటినీ పరిష్కరించి సజావుగా కొనుగోళ్ళు నిర్వహించి రైతులకు న్యాయం చేయాలన్నారు. ఆమేరకు రైతుసంఘం నాయకుడు చిరసాని కోటిరెడ్డి ఆధ్వర్యంలో పలువురు రైతు ప్రతినిధులు జేసీకి వినతిపత్రం సమర్పించారు.

# జడ్పీ హైస్కూలుకు కోగిలి ట్రస్ట్ సాయం


విద్యార్థినికి బహుమతులందజేస్తున్న ట్రస్ట్ ఛైర్మెన్ జయరామిరెడ్డి

సూళ్ళూరుపేటలోని ప్రభుత్వ జడ్పీ బాలికోన్నత పాఠశాలకు అవసరమైన స్టేషనరీ, నీళ్ళ మోటార్, మైక్‌సెట్‌తో పాటు విద్యార్థినులకు విద్యాసామగ్రిని స్థానిక 'కోగిలి జయరామిరెడ్డి చారిటబుల్ ట్రస్ట్' తమ వితరణగా అందజేసింది. ఇటీవల హైస్కూల్‌లో జరిగిన కార్యక్రమంలో ట్రస్ట్ ఛైర్మెన్ జయరామిరెడ్డి ఆ సామగ్రిని అందజేశారు. అనంతరం విద్యార్థినులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులిచ్చారు. పట్టణంలోని హోమియో వైద్యుడు కెఎస్ సాయిరాం, శ్రీనివాసులు, కృష్ణారెడ్డి, రాజేష్‌రెడ్డిలతో పాటు హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు ధనలక్ష్మి, ఉపాధ్యాయిని జానకి పాల్గొన్నారు.

# ఉరికే ఉత్సాహం.. ఉత్తరాన ప్రోత్సాహం

(మొదటి పేజీ తరువాయి)

నిజమయ్యాయి. మొదటినుండి తమకు ఎదురులేదని భావిస్తుండిన కాంగ్రెస్ పంజాబ్‌లో కేవలం 18 సీట్లకు పరిమితం కావడం గమనార్హం. ఇప్పుడు దేశంలో రాజస్థాన్, ఛత్తీస్‌ఘడ్‌లలో మినహా మరే ఇతర రాష్ట్రంలోనూ కాంగ్రెస్ పార్టీ అధికారంలో లేదు.

ఇక గోవాలో అత్యధిక సీట్లు సాధించిన పార్టీగా భాజపా ముందంజలో నిలిచినా ఇతర పార్టీల నిర్ణయంపై ఇక్కడ అధికార పగ్గాలు చేపట్ట బోయేదెవరో తేలుతుంది. భవిష్యత్తులో జరగబోయే ఎన్నికలన్నిటికీ రెఫరెండంగా ఈ ఎన్నికలను రాజకీయ విశ్లేషకులు, మేధావులు పలు సందర్భాలలో పేర్కొన్నారు. మొత్తంమీద భారత రాజకీయ భవిష్యత్తుపై ఈ ఎన్నికలు ఒక స్పష్టతను ఇచ్చాయని భావించవచ్చు. ఈ ఫలితాలతో దేశవ్యాప్త భాజపా శ్రేణులలో ఉత్సాహం వెల్లువెత్తింది.

## ఎక్కడా కానరాని కాంగ్రెస్...

వంద సంవత్సరాల చరిత్ర... మూడు తరాలు ఈ దేశాన్ని పాలించిన ఘనత... అన్నీ మంటగలిసిపోయాయి. బంగారం లాంటి ఉమ్మడి రాష్ట్రాన్ని విడగొట్టి ఆంధ్రకి అన్యాయం చేసిన పాపం సోనియమ్మ పాలిట శాపమై కాంగ్రెస్‌పార్టీని మట్టి కరిపించింది. తెలుగోళ్ళ ఉసురు కొంచెం గట్టిగానే తగుల్తోంది. ఈసారి తన చరిష్మాతో ఏదో సాధించాలని ఉవ్విళ్ళూరిన ప్రియాంకగాంధీకి కూడా ఆమెకంత సీన్ లేదన్నట్లుగా ఉత్తరప్రదేశ్ ప్రజలు తీర్పు చెప్పారు. 400కూగాను కాంగ్రెస్‌కు కేవలం 2సీట్లే ఇచ్చి సరిపెట్టుకోమన్నారు.

## ఇక తెలుగు రాష్ట్రాలపై భాజపా దృష్టి...

'ఢిల్లీకి పోదామా..? బంగారు భారత దేశం తెచ్చుకుందామా...??' అంటూ నిన్నటివరకూ మాట్లాడిన తెలంగాణ ముఖ్యమంత్రికి ఈ ఫలితాలు కొంచెం ఇబ్బందికరమే అంటున్నారు విశ్లేషకులు. సాక్షాత్తూ ప్రధానమంత్రి హైదరాబాదుకు వస్తే... కేసిఆర్ ముఖం చాటేయడం, ఇతర రాష్ట్రాలకు వెళ్ళి ప్రాంతీయపార్టీల అధినేతలను కలబెట్టడం, తాజాగా గవర్నర్‌తో వివాదానికి దిగడం వంటి అంశాలను గమనిస్తూ వస్తున్న మోడీ గ్యాంగ్... ఇప్పుడు కేసిఆర్ బ్యాండ్ బజాయించడం ఖాయమని అంటున్నారు. బండి సంజయ్ నేతృత్వంలో తెలంగాణలో భారతీయ జనతా పార్టీని మరింత పటిష్టపరిచే కార్యక్రమానికి వేగం పెంచడంతోపాటు, చంద్రశేఖరరావు దూకుడు తగ్గించడానికి కూడా కమలాధినేతలు వ్యూహరచన చేస్తారన్నది వారి అభిప్రాయం.

## ఆంధ్రాలో ఆచితూచి అడుగు...

ఆంధ్ర విషయానికి వస్తే... ఇక్కడ భారతీయ జనతా పార్టీకి జవసత్వాలు లేవు. సమర్థనీయమైన నాయకత్వం లేదు. 2019 ఎన్నికల తరువాత అథఃపాతాళానికి కూరుకుపోయిన తెలుగుదేశం, అధికారపార్టీ తప్పిదాలవల్ల మళ్ళీ ఊపిరి పోసుకుంటుంది తప్ప, ప్రధాన ప్రతిపక్ష పార్టీగా బీజేపీ ముందుకి రాలేకపోతోంది. ఇలాంటి తరుణంలో భాజపా అధిష్టానం ఆంధ్ర విషయంలో సంయమనం పాటించక తప్పదన్నది మేధావుల అభిప్రాయం. ఎన్నికలు దగ్గరపడే సమయానికి జనసేన, తెలుగుదేశంలకు ఉన్న ఓట్ బ్యాంకును అంచనా వేసుకునిగాని ఆంధ్రాలో ఎలాంటి రాజకీయ నిర్ణయాలు తీసుకోబోదన్న వాదన బలంగా వినపడుతోంది. ఏదిఏమైనా ఈ అయిదు రాష్ట్రాల ఎన్నికల ఫలితాలు సంచలనాత్మకం, సందేశాత్మకం అనడంలో మాత్రం సందేహం అక్కరలేదు.



## జరగండి... జరగండి...
# కేజ్రీ కూడా వచ్చాడు!!

భారత ప్రధానమంత్రి పదవికి పోటీపడుతున్న వారి వరుసలో ఇంకొకరు చేరారు. ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ కూడా 'ఫ్రెష్'గా పోటీలోకి వచ్చారు. పంజాబ్‌లో కాంగ్రెస్ అరాచకాన్ని ఊడ్చేసిన ఆప్(ఎన్నికల గుర్తు చీపురు) అధినేతగా కేజ్రీవాల్ ప్రధానమంత్రి పదవికి సహజంగానే రేస్‌లో ఉన్నారంటూ ఆ పార్టీకి చెందిన రాఘవ్ చద్దా ప్రకటించారు. పంజాబ్‌లో నిజంగానే కాంగ్రెస్‌ను 'ఆప్' ఊడ్చిపారేసింది.

ఢిల్లీలో అధికారంలో ఉన్నప్పటికీ అది పూర్తిస్థాయి రాష్ట్రం కాదు. కేంద్రం అధికారాల కింద పనిచేయాలి. స్వతంత్ర నిర్ణయాలు చేయడానికి కుదరదు. ఢిల్లీ వెలుపల... పంజాబ్ రాష్ట్రంలో మూడింట రెండు వంతుల మెజారిటీని సాధించడం ఆప్‌కు చరిత్రాత్మక విజయమే. అయితే, దేశంలోని 29 రాష్ట్రాలలో అది ఒకటి మాత్రమే. తాను పోటీ చేసిన గోవా, మణిపూర్, ఉత్తరాఖండ్‌లలో ఇదే ఆప్‌కు అడ్రస్ గల్లంతయ్యింది.

అయినప్పటికీ... రాష్ట్రాలలో కొద్దిగా కండబట్టిన నేతల చూపులు తమ తమ రాష్ట్రాలవైపు నుంచి ఢిల్లీవైపు మళ్ళే 'ట్రెండ్' ఈమధ్య బాగా ఎక్కువైనట్టు కనపడుతోంది. తమను ఆమె ఏదో ఉద్ధరిస్తారని బెంగాల్ ప్రజలు మూడోసారి కూడా తృణమూల్ కాంగ్రెస్‌కు పట్టంకడితే మమతా బెనర్జీ చూపు ఢిల్లీ మీద పడింది. స్టాలిన్‌ను చూసి తమిళనాడు ప్రజలు డీఎంకేకు ఓట్లు వేస్తే ఆయన ఢిల్లీ మాటలు మాట్లాడుతున్నారు.

ఇక, మన కేసీఆర్ సరేసరి. ఢిల్లీ పీఠాన్ని చేజిక్కించుకోవాలనే తపనలో పడిపోయి... ఏకబిగిన మూడు భాషల్లో ఊకదంపుడు ఉపన్యాసాలు చేస్తున్నారు. ఏ రాష్ట్రానికి పోతే అక్కడ 'దేశ్‌కీ నేత కేసీఆర్..' అంటూ ఫ్లెక్సీలు. చేతిలో ప్రత్యేక విమానం.. నోట్లో నాలుక ఆయన పెట్టుబడి.

ఇప్పుడు ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్ ఆ టీమ్‌లో కొత్తగా చేరారు. ప్రజలు ఆయా రాష్ట్రాల్లో తమను ఎందుకు గెలిపించారన్నది పక్కనపెట్టేసి అందని ద్రాక్ష కోసం అర్రులు చాస్తున్నారు. లోక్‌సభ ఎన్నికలకు ఇంకా దాదాపు రెండేళ్ల సమయం ఉండగానే, ఇప్పటికే నలుగురు 'ప్రధానమంత్రి' అభ్యర్థులు తేలారు. అయితే, ఆ పదవి ఖాళీగా కూడా లేదు. ఆ పదవిలో బలహీనుడు అసలే లేరు. పైపెచ్చు 'నన్ను భారత ప్రధానిగా గెలిపించండి...' అంటూ దేశమంతా తిరిగి ఆ పదవిలోకి తిష్టవేసిన నరేంద్ర మోదీ ఉన్నారు. రాజ్యాంగ వ్యవస్థలు 'జీ హుజూర్' అంటున్నాయి. రాజకీయ సర్వ టక్కు టమార, గోసాయి విద్యల్లో ఆయనకు సాటిరాగల నేత మరొకరు కనిపించరు. వంద కేసీఆర్‌ల పెట్టు. కేజ్రీవాల్ ఢిల్లీ, పంజాబ్‌కు, స్టాలిన్ తమిళనాడుకు, కేసీఆర్ తెలంగాణకు, మమతా బెనర్జీ బెంగాల్‌కు పరిమితమై తమను ఎన్నుకున్న ప్రజల ఆకాంక్షలను సమర్థవంతంగా నెరవేర్చగలిగితే ప్రధానమంత్రి అయినంత గొప్ప.

# స్నేహధర్మం పాటించిన సిఎం

## ○ సంగం బ్యారేజీకి గౌతమ్ పేరు
## ○ సంబరపడుతున్న అనుచరులు... అభిమానులు



నిర్మాణంలో ఉన్న సంగం బ్యారేజీ



***'స్నేహమేరా జీవితం..స్నేహమేరా శాశ్వతం'..అంటూ ఓ సినీకవి స్నేహం గొప్పదనాన్ని గురించి అద్భుతంగా వివరించారు. నిజమే!..సృష్టిలో తీయనిది స్నేహమేనంటారు స్నేహం విలువ తెలిసినవారు. అలాంటి స్నేహబంధానికి ఎంతో ప్రాధాన్యత ఇచ్చి సాక్షాత్తూ రాష్ట్రముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్నేహం పట్ల తనకున్న అపారమైన విశ్వాసాన్ని చాటుకున్నారు. ఇటీవల దివంగతుడైన తన ఆత్మీయమిత్రుడు దివంగత మంత్రి మేకపాటి గౌతమ్‌రెడ్డికి శాసనసభలో ఘనమైన నివాళి అర్పించారు. తమ స్నేహమాధుర్యానికి చెరగిపోని గుర్తుగా నెల్లూరు జిల్లాలోని సంగం బ్యారేజీకి గౌతమ్‌రెడ్డి పేరు పెట్టాలని, తద్వారా తన మిత్రుడి పేరును శాశ్వతం చేయాలని ముఖ్యమంత్రి నిర్ణయించి అందరి హర్షధ్వానాలు అందుకున్నారు. అంతేకాదు మేకపాటి రాజమోహన్‌రెడ్డి కోరిన మూడు కోరికలను తప్పకుండా నెరవేరుస్తామని హామీ ఇచ్చారు. జిల్లాలోని ప్రజలు, ముఖ్యంగా గౌతమ్‌రెడ్డి సొంత నియోజకవర్గమైన ఆత్మకూరు ప్రాంత ప్రజలు, అభిమానులు, అనుచరులు సిఎం తీసుకున్న ఈ సముచితమైన నిర్ణయాలకు ఎంతో సంతోషించారు.***

స్నేహాలు అందరికీ ఉండవచ్చు. నేస్తాలు లేని వారు ఎవరూ ఉండకపోవచ్చు. కానీ చాలామంది విషయంలో ఆ స్నేహానుబంధాలు కూడా కాలక్రమంలో కరిగిపోతుంటాయి. తమ స్నేహితులను ఎప్పటికీ మరచిపోకుండా ఉండడం, వారి పట్ల తమకున్న అభిమానాన్ని కలకాలం మనసులో నిలుపుకోవడం ఏ కొద్దిమందికో సాధ్యమవుతుంది. అందులోనూ కొద్దిపాటి అధికారం లేదా పదవులు వచ్చినా చాలు.. బాల్యస్నేహాలను, పాతమిత్రులను మరిచి పోయే రోజులివి. అలాంటిది ముఖ్యమంత్రి స్థాయిలో ఉన్న జగన్ తనకు చిన్ననాటి నుంచి స్నేహితుడు, చిరకాల మిత్రుడైన గౌతమ్‌ను మరచిపోలేకపోతున్నారు. ఆయన మరణాన్ని జీర్ణించుకోలేకపోతున్నారు. గౌతమ్ పేరు తలచుకుంటే చాలు.. గౌతమ్‌తో తనకున్న స్నేహానుబంధాన్ని గుర్తుచేసుకుని బాధాతప్తహృదయుడవుతున్నారు. ఒక ముఖ్యమంత్రి తన స్నేహితుని పట్ల ఇంత అభిమానాన్ని.. ఆదరాన్ని చూపడం అందరికీ ఆశ్చర్యాన్ని కలుగజేస్తోంది. మంచితనంతో మానవత్వంతో.. మచ్చలేని రాజకీయాలతో.. అందరికీ ఆదర్శవంతంగా ఉంటున్న గౌతమ్ మంచి వ్యక్తిత్వానికిది మచ్చుతునక.

రాష్ట్ర పరిశ్రమల మంత్రిగా రాష్ట్రానికి అనేక పరిశ్రమలు, పెట్టుబడులు సాధించుకొస్తున్న యువనేత గౌతమ్‌రెడ్డి ఉత్సాహాన్ని చూసి ఓర్వలేక మృత్యువు గుండెపోటు రూపంలో పొట్టనబెట్టుకుంది. తన మిత్రుడు ఇలా హఠాత్తుగా మరణించడాన్ని ఊహించలేకపోయారు సిఎం జగన్. వెంటనే హైదరాబాదులోని గౌతమ్ నివాసానికి సతీసమేతంగా వెళ్ళి, చూసి నిశ్చేష్టులయ్యారు. ఆ తర్వాత ఆత్మకూరులో జరిగిన అంతిమయాత్రలోనూ పాల్గొని తీరని వేదనతో కుమిలిపోతున్న కుటుంబసభ్యులను ఊరడించి ధైర్యం చెప్పారు. కుటుంబపెద్ద, తమ కుటుంబానికి ఎంతో సన్నిహితుడైన గౌతమ్ తండ్రి మేకపాటి రాజమోహన్‌రెడ్డి దంపతులను ఆ కుటుంబ సభ్యుడిలా, తానే వారి పెద్దబిడ్డలా ఓదార్చారు. రాష్ట్ర శాసనసభలోనూ తన మిత్రుడికి ఘనమైన నివాళి అర్పించి స్నేహానికి మరింత విలువనిచ్చారు. గౌతమ్ లేడనే ఊహే భరించలేకపోతున్నానని సిఎం ఎంతో ఆవేదనతో చెప్పడం అందరినీ కంటతడిపెట్టించింది. గౌతమ్ తనకంటే ఒక సంవత్సరం పెద్దవాడని, అయినా తనను అన్నగా భావించి ఆత్మీయంగా ఉండేవాడని, తానంటే గౌతమ్‌కు ఎంతో విశ్వాసమని, చిన్నతనంలోనే కాకుండా... ఆ తర్వాత రాజకీయాల్లో కూడా తొలి నుంచి తనతోనే ఉన్న గౌతమ్‌ను మరచిపోలేకపోతున్నానని, మంత్రిగా రాష్ట్రానికి ఆయన సేవలు మరపురానివని, అలాంటి ఆత్మీయుడిని కోల్పోవడం తనకే కాదు రాష్ట్రానికి కూడా తీరని లోటని చెప్పారు.

## త్వరలోనే సంగం బ్యారేజీ ప్రారంభం :

అసెంబ్లీ సమావేశంలో గౌతమ్ స్వస్థలమైన ఆత్మకూరు నియోజకవర్గంలో ఉన్న సంగం బ్యారేజీకి గౌతమ్ పేరు పెట్టాలని నిర్ణయించడం గౌతమ్‌కు అసలైన నివాళిగా ప్రజలు భావిస్తున్నారు. త్వరలోనే..బహుశా మరో ఆరువారాల్లో బ్యారేజీ నిర్మాణం పనులు పూర్తవుతాయని, దానికి 'మేకపాటి గౌతమ్ సంగం బ్యారేజీ' అని నామకరణం చేసి ప్రారంభిస్తామని సిఎం జగన్ అందరి హర్షధ్వానాల మధ్య ప్రకటించారు. స్నేహితుడు కన్నుమూసినా..స్నేహధర్మాన్ని పాటించి జగన్ అందరి అభినందనలు అందుకున్నారు. గౌతమ్ మనమధ్య లేకున్నా తన కలలు, తన ప్రాంతానికి మంచి జరగాలన్న కోరికను ఖచ్చితంగా నెరవేరుస్తామన్నారు. వారి కుటుంబానికి తామెప్పుడూ అండగా ఉంటామన్నారు.

## తీరనున్న మేకపాటి 3 కోరికలు :

గౌతమ్ తండ్రి మేకపాటి రాజమోహన్‌రెడ్డి కోరిన మూడు కోరికలు తీరుస్తామని సిఎం జగన్ ఈ సందర్భంగా వాగ్దానం చేశారు. ఉదయగిరిలోని మేకపాటి రాజమోహన్‌రెడ్డి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ (మెరిట్స్) కాలేజీకి గౌతమ్ పేరు పెట్టి వ్యవసాయం, ఉద్యానరంగాలకు బోధనా కళాశాలగా ఏర్పాటుచేయాలని రాజమోహన్‌రెడ్డి కోరారని, ఆ కాలేజీని ప్రభుత్వం తీసుకుని ఆయన ఆశించినట్లుగానే గౌతమ్ పేరుతో ఆ కోర్సులను ప్రవేశపెట్టి ఉత్తమ కళాశాలగా తీర్చిదిద్దుతామన్నారు. అదేవిధంగా ఉదయగిరి ప్రాంతానికి సాగునీళ్ళివ్వడం, ఉదయగిరి డిగ్రీకాలేజీలో 'నాడు-నేడు' పథకం కింద వసతులు పెంచడం..ఈ మూడు కోరికలను ఖచ్చితంగా నెరవేరుస్తామని సిఎం హామీ ఇవ్వడంతో శోకసంద్రంలో ఉన్న గౌతమ్‌రెడ్డి కుటుంబసభ్యులకు ఊరటనిచ్చినట్లయింది. గౌతమ్‌రెడ్డి లేకున్నా, ఆయన కోరుకున్న విధంగా, ఆయన స్మృతితో వెనుకబడిన ప్రాంతాలైన ఆత్మకూరు-ఉదయగిరిల్లో జరుగుతున్న పలు అభివృద్ధి పథకాలను చూసి తన బిడ్డ.. గౌతమ్‌కు జన్మనిచ్చిన గడ్డ గర్వపడుతోంది.

## 'ప్రభా'తం

# ఆచరణకు రాని.. మహిళా సాధికారత

**స్వాతంత్య్రం వచ్చి 75 ఏళ్లవుతున్నా నేటికీ మనదేశంలో మహిళలకు స్వేచ్ఛ సమానత్వాలు ఉండడం లేదు. మహిళలకు సాధికారత అంటూ ఉంటారే తప్ప ఆచరణలో ఎప్పుడొస్తుందో తెలియదు. మహిళలకు అన్నిరంగాల్లో సమానావకాశాలు అంటారే తప్ప ఏవీ?.. మూడు దశాబ్దాలవుతున్నా అసలు మహిళా బిల్లుకే మోక్షం లేదు. ప్రభుత్వాలు ఇకనైనా చిత్తశుద్ధితో మహిళల సాధికారతకు బాటలు వేయాలి. పురుషులకు ధీటుగా వారికి అన్నిరంగాల్లో అన్నివిధాలా ప్రోత్సాహం ఇవ్వాలి. మరోవైపు పెరుగుతున్న అత్యాచారాలు, అఘాయిత్యాలు, హత్యలతో మహిళాలోకం తల్లడిల్లుతోంది. వారికి రక్షణ కల్పించి, వారి జీవితాల్లో వెలుగులు నిండేలా చూడాలి. అప్పుడే మహిళా దినోత్సవాలకు సార్థకత!...**

మనదేశంలో చాలామంది నాయకుల మాటలకు చేతలకు అసలు పొంతనే ఉండదు. ఎప్పటికెయ్యది ప్రస్తుతమో అప్పటికా మాటలాడి..చాకచక్యంగా తప్పించుకోవడం, ఇచ్చిన మాటలు ఏళ్ళతరబడి నిలుపుకోకపోవడం మనవాళ్ళకి చేతనైనంతగా మరెవరికీ తెలియదేయమో!..లేకుంటే ఎప్పుడు మహిళల మాట ప్రస్తావనకు వచ్చినా ఆకాశంలో సగం..అవకాశాల్లో సగం మహిళలకేనంటూ ఉత్తుత్తి మాటలతో కాలం గడిపేస్తుంటారు. వాస్తవానికి ఆ మాటలు చేతల్లోకి వచ్చేదెప్పుడో ఆ దేవుడికే తెలియాలి. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్ళు గడిచినా ప్రపంచంలోనే అతి గొప్ప ప్రజాస్వామిక దేశమైన మనదేశంలో నేటికీ మహిళలకు మాత్రం స్వేచ్ఛ, సమానత్వం ఉండడం లేదు. స్త్రీ-పురుష సమానత్వంలో అంతరాలు ఎప్పటికప్పుడు పెరుగుతున్నాయే తప్ప తరగడం లేదు. స్త్రీ పురుషుల మధ్య సమానతల అంశంపై ప్రపంచంలోని 142 దేశాల స్థితిగతులను అంచనా వేస్తే మనదేశానికి అందులో అత్యంత దారుణంగా 114వ స్థానం లభించిందని ప్రముఖుల అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. మన దేశంలో మహిళలకు చట్ట సభల్లో 33 శాతం అవకాశం కల్పించాలని ఎంతో కాలం నుంచి చెప్తూనే ఉన్నారు తప్ప ఆచరణలో ఆ బిల్లు ఏళ్లుగడుస్తున్నా అటకమీది నుంచి కిందికి దిగలేదంటే మన నాయకులు, రాజకీయాలు మహిళలకు ఏమాత్రం అవకాశాలు కల్పిస్తున్నాయో అర్థమవుతుంది. దాదాపు మూడు దశాబ్దాలుగా మహిళా బిల్లుకు మోక్షం లేకపోవడం ఎంత బధాకరం!.. ప్రతి ఏటా మార్చి 8న మహిళా దినోత్సవం వచ్చినప్పుడల్లా పురుష నాయకులు మహిళల అభ్యున్నతికి ఏదేదో చేసేస్తున్నామంటూ ఊకదంపుడు ఉపన్యాసాలిచ్చేస్తుంటారు. శుష్కవాగ్దానాలు..శూన్యహస్తాలు అనే రీతిగా చెప్పేదొకటి.. చేసేదొకటి. మానవ పరిణామ క్రమంలో పురుషులు, మహిళలు ఇద్దరూ సమాన భాగస్వాములే. ఒకరు లేనిదే మరొకరు లేరు. అయినా మహిళలంటే చిన్నచూపు చూడడం, పురుషాధిక్యత ప్రదర్శించడం ఎంతోకాలం నుంచి మనదేశంలో సర్వసాధారణమైపోయింది. రకరకాల కట్టుబాట్లు, సంప్రదాయాలతో మహిళకు వేధింపులు. అయితే కాలక్రమంలో ఎందరో మహానుభావుల కృషి ఫలితంగా నాటి సాంఘిక దురాచారాలు సమసిపోయి మహిళలు ఇప్పుడిప్పుడే బాగా చదువుకుని ఉద్యోగాలు చేసుకునే స్థితికి వచ్చారు. గతంతో పోలిస్తే ఇప్పటికి ఎంతో మేలు. ఎంతదాకానైనా చదువుకునేందుకు వెసులుబాటు ఉంటోంది. ఎందరో సంఘసంస్కర్తల పుణ్యమా అంటూ ఎంతోమంది మహిళలు అన్ని కష్టాలను అధిగమిస్తూ ఇప్పుడు బాగా చదువుకుంటున్నారు. దేశ విదేశాల్లోనూ ఉద్యోగాలు చేస్తున్నారు. ఎంతో ప్రతిభాపాటవాలతో, అపారమైన మేధస్సుతో మహిళలు ఇటీవలి కాలంలో పురోగమిస్తుండం హర్షదాయకం. అయినా సమాజంలో నేటికీ లింగవివక్ష పోనే లేదు. అందుకే మహిళగా పుట్టడం కంటే అడవిలో మానై పుట్టడమే మేలనే పాతసామెత నేటికీ అక్షరసత్యంగానే ఉంది. సమాజంలో ఇంకా నేటికీ లింగవివక్ష కొనసాగుతూనే ఉంది. మహిళలను పురుషులతో సమానంగా చూడడమన్నది మాటల్లోనే తప్ప ఆచరణలో లేదన్నది బహిరంగ రహస్యం. ముఖ్యంగా మనదేశంలో మహిళల పరిస్థితి దయనీయంగానే ఉంది. కోట్లాదిమంది మహిళల జీవితాలు నేటికీ స్వేచ్ఛ సమానత్వాలకు దూరంగా.. అంధకారబంధురంగానే ఉంటున్నాయి. ఆడపిల్ల పుడితేనే ఇంట్లో కష్టాలు పుట్టినట్లుగా బాధపడే తల్లితండ్రులకు కొదవలేని దేశం మనది. అయితే నిజానికి పుట్టిన దగ్గర నుంచి ఆడపిల్లలకే అన్ని కష్టాలు. బడులకు వెళ్ళి చదువుకోవడం, ఉన్నత చదువుల కోసం ఇతర ప్రాంతాల్లో ఉండడం వంటివన్నీ పెద్ద సమస్యలు. ఇక వివాహమన్నది ఇంకా పెద్ద సమస్య. పెళ్ళి కావడం ఒక బాధైతే, పెళ్లయిన తర్వాత రెండింతల బాధలు. వరకట్నాలు, హింసలు, చావులు..ఎన్నెన్నో!.. మరోవైపు దేశంలో పెరిగిపోతున్న అత్యాచారాలు, అఘాయిత్యాలు, అభద్రత మహిళల మనుగడకే ముప్పు వాటిల్లేలా చేస్తున్నాయి. ఆడ పిల్లలకు, మహిళలకు భద్రత అన్నది నేతిబీరకాయ చందమే అవుతోంది. కుటుంబానికి ప్రాణమిచ్చి కాపాడే స్త్రీమూర్తులకు కూడా గృహహింసల బాధ తప్పడం లేదు. మనదేశంలో మహిళలపై జరిగే నేరాల్లో 90 శాతం గృహహింసలవేనని తాజా గణాంకాలు స్పష్టంగా చెప్తున్నాయి. ఇంటా బయటా భద్రత లేకపోవడం, కట్టుకున్న భర్తే కాలయముడై నరకం చూపించడం వంటివి ఎన్నో సంఘటనల్లో చూస్తూనే ఉన్నాం. ప్రభుత్వాలు ఈ దురంతాలను రూపుమాపేందుకు చట్టాలెన్నో చేస్తున్నా..నేరాలు ఘోరాల సంఖ్య మాత్రం తగ్గడం లేదు. ప్రభుత్వాలు ఇంకా కఠినశిక్షలు అమలు చేస్తే తప్ప ఇవి అదుపులోకి రావు. బిడ్డల మీద ప్రేమతో తల్లులు పడే ఆరాటం, కుటుంబ వృద్ధి కోసం చేసే స్త్రీమూర్తుల సేవలు వెలకట్టలేనివి. ఇక మాతృమూర్తుల త్యాగాలకు అంతే ఉండదు. ఇలా అన్నివిధాలుగా స్త్రీలు, మహిళలు కుటుంబం కోసం, సమాజం కోసం..మొత్తంగా దేశ అభ్యున్నతి కోసం తమ జీవితాలనే అర్పిస్తున్నా..వారి జీవితాల్లో మాత్రం వెలుగులు ఉండడం లేదు. వారి కలలు పండడం లేదు. ఈ అత్యంత ఆధునిక కాలంలోనూ నేటికీ నిత్యం అనేక రకాల సమస్యలతో, వేదనలతో మహిళాలోకం అలమటిస్తూనే ఉంది. ఎంతగా చదువుకున్నా ఆశించిన స్థాయిలో ఇంకా సమానావకాశాలు ఉండడం లేదు. దేశంలో దాదాపు 47 కోట్లమంది దాకా ఉద్యోగాలు, ఉపాధి రంగాల్లో ఉన్నతస్థాయిలో ఉంటే అందులో మహిళలు కేవలం 24 శాతం మంది మాత్రమేనని అంచనా. ఇకనైనా ప్రభుత్వాలు మహిళల పట్ల చిన్నచూపు చూడకుండా పురుషులతో సమానంగా వారికి అన్నిరంగాల్లో ప్రోత్సాహం ఉండేవిధంగా చర్యలు తీసుకోవాలి. రాజకీయ రంగంలోనూ వారిని ధీటుగా ఉండేలా వెంటనే మహిళాబిల్లుకు మోక్షం కలిగించి మహిళల అభ్యున్నతికి బాటలు వేయాలి. తద్వారా సాధికారతకు బాటలు వేయాలి. అప్పుడే మహిళా దినోత్సవాలకు సార్థకత!...

# స్థానిక పత్రికలపై చిన్నచూపు తగదు

**- ఏపియుడబ్ల్యుజె రాష్ట్ర కార్యదర్శి ఏ.జయప్రకాష్**



ప్రజాస్వామ్యానికి దిశ-దశ నిర్దేశిస్తూ, ఎలాంటి ప్రలోభాలకు, ఒత్తిడులకు లొంగకుండా ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించేందుకు తమ వంతు కర్తవ్యాన్ని నిర్వహిస్తున్న స్థానిక పత్రికలను కాపాడాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఏపీయూడబ్ల్యూజె రాష్ట్ర కార్యదర్శి జయప్రకాశ్ అన్నారు. ఈనెల 8న నెల్లూరులో జరిగిన సామ్నా సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్థానిక పత్రికలు ఎక్కువకాలం ప్రజలతో మమేకమై ఉంటాయని, ప్రజలకు సమాచారాన్ని అందిస్తాయని, ఎలాంటి ఆశలు లేకుండా ఆశయాల కోసం పనిచేస్తాయని అన్నారు. స్వాతంత్ర్య పోరాట కాలంలో ప్రజల్ని చైతన్యపర్చినవి కూడా స్థానిక పత్రికలేనని గుర్తుచేశారు. అలాంటి పత్రికలపై ప్రభుత్వం చిన్నచూపు చూపిస్తూ, రకరకాల ఉత్తర్వులు జారీ చేస్తూ స్థానిక పత్రికల మనుగడను ప్రశ్నార్థకంగా మార్చడం విచారకరమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రాజకీయ ఒత్తిడులకు తలొగ్గకుండా వాస్తవాలను ప్రజలకు తెలియజెప్పడం స్థానిక పత్రికలకే చెల్లుతుందన్నారు. స్థానిక పత్రికలకు ప్రభుత్వ ప్రకటనలను తప్పనిసరిగా ఇవ్వాలని, జీఎస్టీనుంచి మినహాయించాలని, ప్రతి ఒక్కరికి అక్రిడిటేషన్ మంజూరు చేయాలని కోరారు. రాష్ట్రంలోని జర్నలిస్టుల కుటుంబాలకు ఉచిత విద్య అందే విధంగా చట్టాలు మార్చాలని, వారికి గృహ వసతి కల్పించాలని, కార్పొరేట్ ఆస్పత్రుల్లో కూడా ఉచిత వైద్యం అందించాలని ఆయన ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా నూతనంగా రాష్ట్ర కార్యవర్గానికి ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన పి.విజయకుమార్‌ను, కార్యవర్గ సభ్యుడిగా ఎన్నికైన టి.గోపీనాథ్‌లను ఘనంగా సన్మానించారు. సామ్నా జిల్లా అధ్యక్ష కార్యదర్శులు సర్వేపల్లి రామమూర్తి, జి.హానూక్, గౌరవ అధ్యక్షుడు సింగరాజు రామారావు, ఉపాధ్యక్షులు వేలూరు సుబ్బారావు, ఆవుల వెంకటేశ్వర్లు, అక్మల్, నీలం నరసయ్య, జి.విక్రమ్, ప్రవీణ, హజరత్తయ్య, వి.భాస్కరరావు, కరుణాకర్, పి.జావేద్ తదితరులు పాల్గొన్నారు.

# దేశంలో వైద్యవిద్యను బాగా అభివృద్ధి చేయాలి




ఒకప్పుడు ప్రపంచానికి వైద్యసూత్రాలు తెలియజెప్పిన ధన్వంతరి, చరకుడు వంటి మహనీయులు పుట్టిన మన దేశంలో ఇప్పుడు వైద్యవిద్య అన్నది అందని ద్రాక్షగా మిగిలిపోతుండడం బాధాకరం. భారీగా లక్షల్లో ఖర్చు పెట్టుకునేవారికి తప్ప సామాన్యులకు వైద్యవిద్య అందుబాటులో ఉండడం లేదు. అంతేకాదు, ఒకవేళ ఎంత డబ్బు ఖర్చుపెట్టుకున్నా మనదేశంలో ఆశించినస్థాయిలో నాణ్యమైన వైద్యవిద్య లభిస్తున్నదా అంటే అదీ లేదు. ఫీజులు లక్షల్లో ఉంటున్నా మెడిసిన్ సీట్లు మాత్రం అందరికీ దక్కడం లేదు. మనదేశంలో ఎంతోకాలం నుంచి ఈ దుస్థితి ఉంది. ఆశించిన స్థాయిలో వైద్యవిద్యకు సంబంధించిన చదువులు కానీ, కళాశాలలు, విశ్వవిద్యాలయాలు కానీ లేవు. చివరికి వైద్యరంగంలో రాణించాలంటే ఇతర దేశాలకు వెళ్తే తప్ప కుదరడం లేదు. మనదేశానికి చెందిన వేలాదిమంది విద్యార్థులు ఇటీవలికాలంలో ఉక్రెయిన్ దేశానికి వెళ్ళడం, అక్కడ హటాత్తుగా యుద్ధం సంభవించడంతో బతుకు జీవుడా అంటూ తిరిగి స్వదేశానికి ఎలాగో కష్టపడి తిరిగి రావడం మనం చూస్తూనే ఉన్నాం. అయినా వైద్యవిద్య కోసం అంతదూరం వెళ్లాలా?.. మనం ఆ ప్రగతిని సాధించుకోలేమా?.. అసలే ఒకవైపు కరోనా వంటి వ్యాధులు మానవాళిని నమిలి మింగేస్తున్నాయి. ఆ మహమ్మారి వ్యాధి రావడంతో మనదేశానికే కాదు, ప్రపంచానికే గుణపాఠం చెప్పినట్లయింది. రోగుల ప్రాణాలను కాపాడే వైద్యరంగం అన్నది ఎంత కీలకమో అందరికీ తెలిసొచ్చింది. ఆసుపత్రులు, పడకలు, మందులు మాకులు వగైరాలన్నీ ఎంత అవసరమో గుర్తొచ్చింది. అయినా నేటికీ ఆ కొరత తీరడమే లేదు. ముఖ్యంగా వైద్యవిద్యకు ప్రభుత్వాల నుంచి మంచి ప్రోత్సాహం ఉండడం లేదు. వైద్యుల కొరత, వైద్యసిబ్బంది కొరతతో మనదేశంలో ఉన్న ఆసుపత్రులు అరాకొర వసతులు, వైద్యంతోనే సరిపెట్టుకుంటున్నాయి. ప్రభుత్వాలు ఇకనైనా కళ్ళు తెరవాలి. వైద్యవిద్యను అన్ని ప్రాంతాల్లో బాగా అభివృద్ధి చేయాలి. ప్రతిభాపాటవాలున్నా వైద్యవిద్య చదువుకునేందుకు అవకాశాలు లేక నిరాశపడే విద్యార్థులను ప్రోత్సహించి వారికి చదువుకునేందుకు తగు సాయం అందజేయాలి. మానవజీవితాలను నిలబెట్టే వైద్యరంగాన్ని ఏమాత్రం విస్మరించకుండా బడ్జెట్‌లలో నిధులు కేటాయించాలి. అంతర్జాతీయస్థాయి పరిజ్ఞానంతో మన విద్యార్థులు వైద్యరంగంలోనూ ధీటుగా రాణించేలా చూడాలి.

**కె.ప్రసాద్‌బాబు, గూడూరు.**

# మాటల్లో దూషణలెందుకు?..

ఇటీవల కొందరు నాయకుల మాటల్లో వ్యక్తిగత దూషణలు వినిపిస్తున్నాయి. ఎవరి గురించి ఎప్పుడు ఎవరేమంటారో తెలియదు. ప్రత్యర్థుల మీద విమర్శలు రాజకీయాల్లో సహజమే కానీ దూషణలు, బూతులు మాట్లాడడం వంటివి ఏనాడూ సమర్థనీయం కాదు. సెల్‌ఫోన్‌లు వచ్చాక దేశవ్యాప్తంగా ఈ దుష్టసంస్కృతి మరీ ఎక్కువైంది. ఎవరెవరో ఏదేదో మాట్లాడుకుంటూ ఉంటారు. ఎవరు పట్టించుకుంటారు?..అయితే, సమాజంలో మంచి వాతావరణాన్ని పెంపొందించాల్సిన నాయకులు కూడా ఒకరిపై ఒకరు దారుణంగా విమర్శలు చేసుకుంటూ సభలు సమావేశాల్లోనూ నోటికొచ్చినట్లల్లా తిట్టుకోవడం, ఒక్కోసారి కొట్టుకునేందుకు కూడా సిద్ధం కావడం వంటి సంఘటనలు సభ్యసమాజానికి ఏవగింపు కలిగిస్తున్నాయి. విమర్శలు సద్విమర్శలుగా ఉండాలే కానీ దూషణలుగా ఉండకూడదు. ఎవరైనా సరే విమర్శలను సమర్థవంతంగా ఎదుర్కోవాలి. వివేకంతో మసలుకోవాలి. అందులోనూ నాయకులన్నవారికి సహనం, సంయమనం రెండూ అవసరం. మంచి నాయకుడనిపించుకోవాలంటే మంచిగానే ఉండాలి. ఆదర్శవంతంగా ఉంటూ పదుగురికీ మార్గదర్శకంగా ఉండాలి.

**ఎల్.ఎం సామ్రాజ్యమ్మ, మైపాడు.**

# శ్రీసిటీలో 'జెన్ లినెన్' రెండో ఉత్పత్తి కేంద్రం

**అంతర్జాతీయ మహిళా దినోత్సవానికి రెండు రోజుల ముందే శ్రీసిటీలో మహిళా ఉద్యోగులకు మరిన్ని అవకాశాలు లభించేలా 'జెన్ లినెన్' పరిశ్రమ మరో ఉత్పత్తి కేంద్రానికి భూమిపూజ చేయడం విశేషం. ప్రపంచవ్యాప్తంగా బెడ్లు. దిండ్లు తయారీలో పేరెన్నికగన్న 'జెన్ లినెన్' పరిశ్రమ ఈ అదనపు ఉత్పత్తి కేంద్రానికి శ్రీకారం చుట్టింది. దాదాపు రూ.50 కోట్ల పెట్టుబడితో 3.25 ఎకరాల స్థలంలో శ్రీసిటీలో ఈ పరిశ్రమ కొత్త ప్లాంట్‌ను ఏర్పాటుచేస్తోంది. ఈ ఏడాది అక్టోబర్ నాటికి ప్లాంట్ నిర్మాణం పూర్తవుతుందని భావిస్తున్నారు. ఈ పరిశ్రమ ద్వారా 800 మందికి పైగానే ఉద్యోగ అవకాశాలు లభిస్తాయి. అందులోనూ ఈ పరిశ్రమలో అత్యధిక శాతం ఉద్యోగావకాశాలు మహిళలకే ఉంటాయని ఆశిస్తున్నారు.**

## • అత్యధిక శాతం ఉద్యోగావకాశాలు మహిళలకే



భూమిపూజ నిర్వహిస్తున్న జెన్ లినెన్ సంస్థ ఛైర్మన్ భరత్ మోహింద్ర

అంతర్జాతీయ ఖ్యాతిగాంచిన శ్రీసిటీ పారిశ్రామికవాడలో ప్రపంచవ్యాప్త పేరు గాంచిన జెన్ లినెన్ పరిశ్రమ అదనపు ఉత్పత్తి కేంద్రానికి ఈనెల 6న భూమి పూజ చేసింది. ఆ సంస్థ ఛైర్మెన్ భరత్ మోహింద్ర ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తూర్పు దక్షిణాసియాలో బెడ్లు, దిండ్లు తయారీలో ప్రథమ స్థానంలో ఉన్న తాము, తమ వ్యాపార విస్తరణలో భాగంగా శ్రీసిటీలో 1.35 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో అదనపు ప్లాంట్ నిర్మాణం చేపడుతున్నట్లు చెప్పారు. శ్రీసిటీలో జెన్ లినెన్ ఏర్పాటై ఏడేండ్లు గడిచిందని, ఇక్కడ వసతులతో పాటు శ్రీసిటీ యాజమాన్య సహకారం బాగుందని, దీంతో తమ పరిశ్రమ విస్తరణ చేపడుతున్నామని తెలిపారు.

### జెన్ లినెన్ విస్తరణ హర్షదాయకం

**- శ్రీసిటీ ఎం.డి రవీంద్ర సన్నారెడ్డి**

పరిశ్రమ విస్తరణ చేపట్టిన జెన్ లినెన్ యాజమాన్యానికి శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ రవీంద్ర సన్నారెడ్డి అభినందనలు తెలిపారు. నాణ్యమైన బెడ్‌ల ఉత్పత్తులలో ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన జెన్ లినెన్ సంస్థ పురోగతి దిశగా పయనిస్తూ ప్లాంట్ విస్తరణ చేపట్టడం చాలా సంతోషంగా ఉందన్నారు. పెరుగుతున్న వ్యాపార అవకాశాల దృష్ట్యా ఇప్పటికే శ్రీసిటీలో ప్రస్తుతం ఉన్న పరిశ్రమలలో 20 శాతం పరిశ్రమలు తమ ప్లాంట్ ఉత్పత్తి సామర్థ్యాలను పెంచుకున్నాయని తెలిపారు. పలు పరిశ్రమలు శ్రీసిటీలో విస్తరణకు మొగ్గు చూపడం, ఇక్కడ వ్యాపార అనుకూల వాతావరణానికి అద్దం పడుతోందన్నారు. ఈ పరిశ్రమలో ఎక్కువగా మహిళా కార్మికులు పనిచేస్తుండడం పట్ల ఆయన సంతోషం వ్యక్తం చేశారు. ప్లాంట్ విస్తరణ ద్వారా మహిళలకు అదనపు ఉద్యోగ అవకాశాలు కలగడంతో పాటు, ఈ ప్రాంతంలో ఆర్థిక వృద్ధిని మరింత పెంచుతుందన్నారు. నాణ్యమైన, నాజూకైన మెత్తని పత్తి దుప్పట్లు, పడక మెత్తలు, వివిధ రకాలైన తలగడలు వంటి సుఖనిద్రకు ఉపయోగించే ఉత్పత్తులను ఇందులో ఉత్పత్తి చేస్తారని, జెన్ లినెన్‌కు అంతర్జాయంగా మంచి మార్కెట్ ఉందని ఆయన తెలిపారు. ఈ భూమిపూజ కార్యక్రమంలో శ్రీసిటీ ప్రెసిడెంట్(ఆపరేషన్స్) సతీష్ కామత్, వైస్‌ప్రెసిడెంట్ (కస్టమర్ రిలేషన్స్) రమేష్‌కుమార్ పాల్గొన్నారు.

# జాతీయ భద్రతా వారోత్సవాల ముగింపు సంబరాలు



పారిశ్రామిక కార్మికుల భద్రత ఆవశ్యకతను గుర్తిస్తూ శ్రీసిటీలో ఇటీవల 51వ భద్రతా వారోత్సవాల ముగింపు సంబరాలు నిర్వహించారు. ఇందులో శ్రీసిటీ ఉద్యోగులు, పరిశ్రమల సిబ్బందితో పాటు పలు పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. శ్రీసిటీ ట్రేడ్ సెంటర్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో శ్రీసిటీ ప్రెసిడెంట్ (ఆపరేషన్స్) సతీష్ కామత్ భద్రతా జెండాను ఎగురవేసి భద్రతా ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగిస్తూ ఉద్యోగులు, కార్మికులు, కాంట్రాక్టర్లు మరియు సామాన్య ప్రజలకు భద్రత, ఆరోగ్యం, పర్యావరణంపై అవగాహన కల్పించడమే జాతీయ భద్రతా వారోత్సవ వేడుకల ముఖ్య ఉద్దేశ్యమన్నారు. భద్రత ఎంతో అవసరమని, ఇలాంటి కార్యక్రమాలు ప్రజలకు అవగాహన కల్పించడానికి ఉపయోగపడతాయని శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ రవీంద్ర సన్నారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. అనంతరం వివిధ పోటీల్లో పాల్గొని విజేతలైన వారికి బహుమతులు ప్రదానం చేశారు. శ్రీసిటీ సేఫ్టీ మేనేజర్ కె.నరేంద్ర బాబు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీసిటీ ఫౌండేషన్ సహకారంతో..

# తడలో ఉచిత ఆయుర్వేద శిబిరం




శ్రీసిటీ ఫౌండేషన్ సహకారంతో, శ్రీసిటీలోని శ్రీ తులసీ ఆయుర్వేద వైద్య ఆసుపత్రి ఆధ్వర్యంలో ఇటీవల మండలకేంద్రమైన తడలోని పంచాయతీ కార్యాలయం వద్ద ఉచిత ఆయర్వేద వైద్యశిబిరం నిర్వహించారు. శ్రీసిటీ పరిసర గ్రామాల్లోని ప్రజలు తరలిరావడంతో ఈ శిబిరానికి మంచి స్పందన లభించింది. ఆయుర్వేద వైద్య ఆసుపత్రి డాక్టర్ శివప్రసాద్, శోభారాణి, సాయిప్రియ పాల్గొని దాదాపు 120 మంది రోగులకు వైద్యపరీక్షలు చేసి వారికి ఆరోగ్యపరంగా తగు సూచనలు సలహాలు ఇచ్చారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ప్రజల ఆరోగ్యం కోసం ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరాన్ని నిర్వహించడం జరుగుతోందని, ఇక్కడ ప్రజల ఆరోగ్యానికి తామెంతో ప్రాధాన్యత ఇస్తామని ఈ సందర్భంగా శ్రీసిటీ ఎం.డి రవీంద్ర సన్నారెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజల ఆరోగ్యసంరక్షణ కోసం ఇలాంటి వైద్యశిబిరాలు ఎంతగానో తోడ్పడతాయని, వీటిని తరచూ ఏర్పాటుచేస్తామని, ప్రజలు వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. తడ సర్పంచ్ ఆర్ముగంతో పాటు పెద్దసంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.




## కేంద్ర పథకాల అమలులో

# నెల్లూరు ఫస్ట్

**- ఎంపీ ఆదాల ప్రశంస**

కేంద్ర ప్రభుత్వ నిధులతో రాష్ట్రంలో అమలయ్యే పథకాల్లో నెల్లూరు జిల్లా అగ్రస్థానంలో ఉందని నెల్లూరు ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి ప్రశంసించారు. అందుకు కృషిచేసిన జిల్లా కలెక్టర్‌ను, ఇతర అధికారులను అభినందించారు. ఇటీవల కలెక్టరేట్‌లో జరిగిన జిల్లా మౌలిక సదుపాయాల కల్పన సలహామండలి(దిశ) సమావేశానికి ఆయన అధ్యక్షత వహించి మాట్లాడుతూ ఎన్‌ఆర్‌జిఎస్ పనుల్లో కోటి 18 లక్షల పనిదినాలను కల్పించి దేశంలోనే నెల్లూరుజిల్లా మొదటి స్థానంలో నిలిచిందని, అదేవిధంగా పి.ఎం.ఏ.జి.వై పథకం కింద ఎస్సీ, ఎస్టీ గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనలో జిల్లా రెండో స్థానం సాధించిందని పేర్కొన్నారు. స్వచ్ఛ పర్యవేక్షక ర్యాంకింగ్‌లో నెల్లూరు నగరపాలక సంస్థ దేశంలోనే మొదటి స్థానంలో నిలిచి 10 కోట్ల రూపాయల నగదు బహుమతిని సాధించడం గర్వించదగిన విషయమన్నారు. పిఎం కిసాన్ అమలులో జాతీయఅవార్డు లభించిందని పేర్కొన్నారు.కోవిడ్ నివారణ చర్యల్లోనూ మన జిల్లా ముందంజలో ఉందని, వ్యాక్సినేషన్‌లో కూడా జిల్లా అగ్రభాగాన నిలిచిందన్నారు. డ్వామా ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో జేసి గణేష్‌నాయక్, విజయ డెయిరీ ఛైర్మన్ రంగారెడ్డి, జడ్పీటిసి మల్లు సుధాకర్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ స్వర్ణా వెంకయ్య, పాముల హరిప్రసాద్, శ్రీధర్‌రెడ్డి, నరసింహారావు, అల్లాబక్షు, మధు పాల్గొన్నారు.

## ఆదాలతో ప్రసన్న భేటీ



నెల్లూరు పార్లమెంట్‌సభ్యులు ఆదాల ప్రభాకర్‌రెడ్డిని నెల్లూరులోని ఆయన నివాసంలో కోవూరు శాసనసభ్యులు నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి జిల్లాకి సంబంధించిన పలు అంశాలను చర్చించారు. వైకాపా నాయకులు వీరి చలపతిరావు, దొడ్డంరెడ్డి నిరంజన్ బాబురెడ్డి, శ్రీనివాసులురెడ్డి, కైలాసం ఆదిశేషారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా అభివృద్ధిపై చర్చించిన ఎమ్మెల్సీ కళ్యాణ్



ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డిని ఇటీవల ఎమ్మెల్సీ బల్లి కల్యాణ్‌చక్రవర్తి కలుసుకుని జిల్లా అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలను చర్చించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన జిల్లాల పునర్విభజనను స్వాగతిస్తున్నామని, అయితే దీనిపై కొన్ని సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్ళి పరిష్కరించాలని, జిల్లాలోని అన్ని నియోజకవర్గాలను అభివృద్ధి చేసేందుకు ఎమ్మెల్యేలతో కలసి సమావేశాలు జరపాలని భావిస్తున్నట్లు వారు ఈ సందర్భంగా పేర్కొన్నారు.

## విఎస్‌యులో మౌలిక సదుపాయాలు కల్పించండి

విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం (విఎస్‌యు) వైస్‌చాన్సలర్ సుందరవల్లి, రిజిస్ట్రార్ ఎల్ విజయకృష్ణారెడ్డి ఇటీవల నెల్లూరుకు వచ్చిన ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డిని శుక్రవారం కలిశారు. యూనివర్సిటీలో మౌలిక సదుపాయాల కల్పనకు తగు సహకారం అందించాలని వారు ఎంపీని కోరారు.

లాయర్
విజయపథంలో నెల్లూరీయులు




కాఫీటేబుల్ బుక్ కొరకు
9246431984 నెంబరుకు
గూగుల్‌పే GPay లేదా PhonePe ఫోన్‌పే
ద్వారా రూ.1,000/- (వెయ్యి రూపాయలు)
పంపించి పొందవచ్చును.
వాట్సాప్ ద్వారా మీ ఫోన్ నెంబరు,
చిరునామా తెలియజేస్తే..
కొరియర్ / ర్యాపిడో ద్వారా మీకు పంపిస్తాం.



- మేనేజర్, సర్క్యులేషన్

నెల్లూరు, మాగుంట లే అవుట్‌లోని లాయర్ పత్రిక కార్యాలయం నందు కూడా పొందవచ్చును.

# ఉత్తమ సేవలకు సత్కారం



డా. పి.రామచంద్రారెడ్డి ఆసుపత్రిలో దీర్ఘకాలంగా దంతవైద్య నిపుణురాలుగా పనిచేస్తున్న డా.పద్మను ఇండియన్ డెంటల్ అసోసియేషన్ నెల్లూరు శాఖ వారు 'జీవిత సాఫల్య పురస్కారం'తో ఘనంగా సన్మానించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఈ నెల 8వ తేదీన నెల్లూరులో ఈ పురస్కారాన్ని ఆమెకు అందజేశారు.

# బిందుమీనన్ సేవలు అభినందనీయం

## 9 ఏళ్ళలో 100 వైద్యశిబిరాలు నిర్వహించడం హర్షదాయకం

### - బ్రిగేడియర్ డాక్టర్ రామచంద్రన్ నంబియార్




నెల్లూరులోని ప్రముఖ న్యూరాలజిస్ట్ డాక్టర్ బిందుమీనన్ ఆధ్వర్యంలోని డాక్టర్ బిందుమీనన్ ఫౌండేషన్ సారథ్యంలో నిర్వహిస్తున్న ఉచిత మెడికల్ క్యాంప్‌లు ఇప్పటికే 99 పూర్తికాగా, 100వ మెడికల్ క్యాంప్‌ను నెల్లూరు రామ్మూర్తినగర్‌లోని ఫౌండేషన్ కార్యాలయంలో ఇటీవల ఏర్పాటు చేశారు. దీనిని బ్రిగేడియర్, విశిష్ట సేవా పురస్కార గ్రహీత డాక్టర్ రామచంద్రన్ నంబియార్ ప్రారంభించడం విశేషం.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2013లో ఏర్పాటైన డాక్టర్ బిందుమీనన్ ఫౌండేషన్ ద్వారా ప్రముఖ న్యూరాలజిస్ట్, అపోలో స్పెషాలిటీ హాస్పిటల్ వైద్యురాలు డాక్టర్ బిందుమీనన్ మెడికల్ క్యాంపుల ద్వారా ఉచిత వైద్య సేవలు అందిస్తుండటం, పేదలకు సైతం ఎంతో విలువైన వైద్యాన్ని ఉచితంగా అందిస్తుండడం సంతోషకరమన్నారు. ఈ ఫౌండేషన్ ద్వారా ఏర్పాటు చేయబడిన 100వ మెడికల్ క్యాంప్‌ను తాను ప్రారంభించడం చాలా సంతోషంగా ఉందని వెల్లడించారు. ప్రధానంగా దేశంలోనే ఎక్కడా లేనివిధంగా డాక్టర్ బిందుమీనన్ గ్రామీణ ప్రజల సౌకర్యార్థం న్యూరాలజీ ఆన్ వీల్స్‌ను తీసుకురావడం శుభపరిణామమని అన్నారు. ఫౌండేషన్ ఛైర్‌పర్సన్ డాక్టర్ బిందుమీనన్ మాట్లాడుతూ ఎటువంటి లాభాపేక్ష లేకుండా 2013వ సంవత్సరంలో ఆగస్టు 26వ తేదీన ఈ ఫౌండేషన్‌ను ఏర్పాటుచేశామని అన్నారు. దీని ద్వారా మూర్ఛవ్యాధి, నరాలకు సంబంధించిన స్ట్రోక్స్ తదితర వాటిపై ప్రజల్లో విస్తృతస్థాయిలో అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. ప్రధానంగా న్యూరాలజీ ఆన్ వీల్స్ ఏర్పాటు చేశామని, దీని ద్వారా గ్రామీణ ప్రాంతాలకు వెళ్లి, తమ ఫౌండేషన్ ద్వారా ఉచిత వైద్య పరీక్షలు, చికిత్స, మందులు అందిస్తున్నామన్నారు. ఇప్పటి వరకు 31 గ్రామాల్లో 10వేల మందికి పైగా రోగులను పరీక్షించామని, 343 హైపర్ టెన్షన్ కేసులతో పాటూ, 89 డయాబెటిస్, 119 స్ట్రోక్, 95 మూర్ఛ కేసులను కొత్తగా గుర్తించినట్లు తెలిపారు. తమ ఫౌండేషన్ ద్వారా నిర్వహిస్తున్న మెడికల్ క్యాంపుల ద్వారా ప్రతి నెల రోగులకు ఉచితంగా పరీక్షలు, మందులు పంపిణీ చేస్తున్నామని, ప్రగతి చారిటీస్‌లో మూర్ఛవ్యాధితో బాధపడే 54 మంది అనాథ పిల్లలను దత్తత తీసుకుని, వారికి ఉచితంగా వైద్యసేవలు అందిస్తున్నట్లు తెలిపారు. డాక్టర్ బిందుమీనన్ ఫౌండేషన్ ద్వారా మరిన్ని వైద్య శిబిరాలను నిర్వహించేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అపోలో ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీరామ్ సతీష్, డాక్టర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# ఆసుపత్రుల సమన్వయాధికారిగా డాక్టర్ రమేష్‌నాథ్



జిల్లా ఆసుపత్రుల సమన్వయాధికారి (డిసిహెచ్ఎస్)గా అనంతపురంలో డిసిహెచ్ఎస్‌గా పనిచేస్తున్న డాక్టర్ ఎస్. రమేష్‌నాథ్ నెల్లూరులో నియమితులయ్యారు. నగరంలోని పాత జుబ్లీ ఆసుపత్రిలోని కార్యాలయంలో ఇటీవల ఆయన బాధ్యతలు చేపట్టారు. ప్రభుత్వ మెడికల్ కాలేజీ స్కిన్ స్పెషలిస్ట్ డాక్టర్ రామచంద్రరావు, ఆత్మకూరులోని జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ బి.కమల్‌కిరణ్, ఎన్జీఓల సంఘం నాయకుడు పి.నరసింహులు తదితరులు పాల్గొని ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

# నెల్లూరు కబుర్లు

# మహిళలను గౌరవించుకోవాలి

### - ఇన్‌చార్జి కలెక్టర్ హరేంధిరప్రసాద్



మహిళలను గౌరవించడం, వారికి సమాన హక్కులు కల్పించడం, అన్ని రంగాల్లో ప్రోత్సహించడం వంటి మార్పులు మొదట మన ఇంటి నుంచే మొదలు కావాలని జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ హరేంధిరప్రసాద్ పిలుపునిచ్చారు. ఈనెల 8న నెల్లూరులోని జడ్పీ సమావేశ మందిరంలో ఐసిడిఎస్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సమాజంలో మహిళల పాత్ర కీలకమని, మహిళలను గౌరవించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. చిన్నప్పటినుంచే ఆడపిల్లల పట్ల చిన్నచూపు చూడడం, తక్కువ చేసి చూపడం, అబ్బాయిలకు ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వడం వల్లే సమాజంలో ఇంకా లింగవివక్ష కనిపిస్తుందన్నారు. ఇలాంటి విధానానికి స్వస్తిపలికి ఆడపిల్లలకు సమాన హక్కులు కల్పిస్తే దేశం మరింత అభివృద్ధి పథంలో పయనిస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా అనేక అభివృద్ధి, సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందేలా ప్రోత్సహిస్తుందని, ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పేదలందరికీ ఇళ్ళు, నవరత్నాల పథకంలో ఇంటి పట్టాలను మహిళల పేరుతోనే అందజేయడం జరిగిందని, వైయస్సార్ ఆసరా, జగనన్న తోడు, జగనన్న చేదోడు, వైయస్సార్ చేయూత, అమ్మ ఒడి వంటి పథకాలు మహిళలకు ఎంతగానో ఉపయోగపడుతున్నాయని అన్నారు. అలాగే దిశ చట్టం మహిళలకు మరింత భద్రత కల్పించిందన్నారు. అనంతరం వివిధ రంగాల్లో విశేష ప్రతిభ చూపిన మహిళలను సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని సెంట్రల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆటల పోటీల్లో విజేతలైన మహిళా ఉద్యోగులు, విద్యార్థినులకు ఈ సందర్భంగా ప్రశంసా పత్రం, జ్ఞాపికలు అందజేశారు. జాయింట్ కలెక్టర్ రోజ్‌మాండ్, జిల్లా పంచాయతీ అధికారి ధనలక్ష్మి, డిఆర్‌డిఏ పి.డి సాంబశివారెడ్డి, డిఎంఅండ్‌హెచ్ఓ రాజ్యలక్ష్మి, జడ్పీ సిఇఓ శ్రీనివాస రావు, సెంట్రల్ సిఇఓ పుల్లయ్య, ఐటీడీఏ పిఓ కనక దుర్గ భవాని తదితరులు పాల్గొన్నారు.

# సాహితీ సారధికి సన్మానం



విజయవాడలోని ఠాగూర్ గ్రంథాలయంలో ఈనెల 6న 'మల్లెతీగ' సాహిత్య మాసపత్రిక, చిన్ని నారాయణరావు ఫౌండేషన్ నిర్వహించిన కథలపోటీలో విజేతలకు బహుమతుల ప్రదానం జరిగింది. ఆ సభలో ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ పరిషత్ ఛైర్మెన్ మందపాటి శేషగిరిరావు, కృష్ణాజిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మెన్ టి.జమలాపూర్ణమ్మ, ప్రముఖ రచయితలు శ్రీరామకవచం సాగర్, శిఖామణి, బొగ్గరపు రాధాకృష్ణమూర్తి, ప్రముఖ చిత్రకారుడు బాలి, అభ్యుదయ రచయితల సంఘం జాతీయ కార్యదర్శి పెనుగొండ లక్ష్మీనారాయణలు పాల్గొని చిన్ని నారాయణరావును ఘనంగా సత్కరించారు. స్వతహాగా ఆయన సాహితీవేత్తే కాకుండా జిల్లాలో జరిగే అనేక సాహిత్య కార్యక్రమాలకు సారధిగా వారధిగా వ్యవహరిస్తుండడం అందరికీ తెలిసిందే!

# రంగనాథస్వామికి.. వేడుకగా గరుడసేవ

గరుడ పంచమిని పురస్కరించుకుని నెల్లూరు రంగనాయకులపేటలో ఉన్న శ్రీదేవి భూదేవి సమేత శ్రీ రంగనాథస్వామి దేవాలయంలో ఈనెల 7న స్వామివారికి వైభవోపేతంగా గరుడసేవ నిర్వ హించారు. ఆలయ ప్రధాన అర్చకులు కిడాంబి జగన్నాధాచార్యులు ఆధ్వర్యంలో విశిష్టపూజలు, అలంకరణల అనంతరం జరిగిన ఈ కార్యక్రమంలో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ ధర్మకర్తల మండలి ఛైర్మెన్ ఇలపాక శివకుమార్ ఆచారి, ఇ.ఓ వెంకటేశ్వర్లు పర్యవేక్షించారు.

## ఒకటిన్నర టన్నుల పూలతో..

# శ్రీ రాజరాజేశ్వరిదేవికి పుష్పయాగం



నెల్లూరు దర్గామిట్టలో కొలువై ఉన్న శ్రీ రాజరాజేశ్వరిదేవి అమ్మవారి ఆలయంలో అమ్మవారి విగ్రహప్రతిష్ట జరిగి మార్చి 6వ తేదీ నాటికి 47 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా, అదే రోజును అమ్మవారి జన్మదినంగా భావించి ఆలయ అర్చకులు పెద్దఎత్తున పూజలు చేశారు. ఆలయ ఉప ప్రధాన అర్చకుడు రఘురామమూర్తి, వేదపండితులు, అర్చకులు కలిసి విశిష్టపూజలు చేశారు. అమ్మవారిని శోభాయమానంగా అలంకరించి ప్రత్యేక వేదికపై కొలువుదీర్చారు. ఇతర రాష్ట్రాల నుంచి కూడా తీసుకొచ్చిన 35 రకాల సుగంధభరిత పుష్పాలతో పెద్దఎత్తున పుష్పయాగం చేశారు. శ్రీ రాజరాజేశ్వరి సేవాసమితి ఆధ్వర్యంలో ఈ వేడుక జరిగింది. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. సేవాసమితి అధ్యక్షుడు సన్నపురెడ్డి పెంచలరెడ్డి-పద్మావతి దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. తొలుత నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి పాల్గొని జ్యోతి వెలిగించి, గోపూజ చేసి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆలయ ఇఓ వెండిదండి శ్రీనివాసులురెడ్డి, వ్యవస్థాపక ధర్మకర్త కుటుంబసభ్యులు రత్నం జయరాం, ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు పాల్గొన్నారు.

# దేశాభివృద్ధిలో మహిళల పాత్ర కీలకం

### - విఎస్‌యు ఉపకులపతి ఆచార్య సుందరవల్లి



మేయర్ స్రవంతికి జ్ఞాపికను బహుకరిస్తున్న విఎస్‌యు విసి సుందరవల్లి

దేశాభివృద్ధిలో మహిళల పాత్ర కీలకమని, మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని విక్రమసింహపురి విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య జి.ఎం సుందరవల్లి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఈనెల 8న విఎస్‌యులో జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. మహిళలకు అన్ని అవకాశాలు సమపాళ్లలో లభిస్తున్నాయని, మహిళలు ధైర్యంగా ముందుకువచ్చి ఆసక్తి ఉన్న రంగాల్లో బాగా రాణించేందుకు కృషి చేయాలని అన్నారు. తాము ఎంచుకున్న రంగాల్లో ప్రతిభ సాధించాలని, కృషి పట్టుదలతో రాణించాలని ఈ కార్యక్రమంలో పాల్గొన్న నగర మేయర్ స్రవంతి అన్నారు. ప్రముఖ రచయిత్రి డాక్టర్ పి.చంద్రలత, విఎస్‌యు రెక్టార్ ఎం.చంద్రయ్య, రిజిస్ట్రార్ డా.ఎల్ విజయకృష్ణారెడ్డి, ప్రిన్సిపాల్ సుజా ఎస్ నాయర్, డాక్టర్ వై.విజయ, డాక్టర్ సునీత పాల్గొన్నారు.

# ఫ్రెండ్స్ వాకర్స్ మహిళా దినోత్సవం



అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని నెల్లూరులోని ఫ్రెండ్స్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 6న ముందస్తు వేడుకలు నిర్వహించారు. వక్తలు పాల్గొని మహిళా దినోత్సవం విశిష్టతను వివరించారు. వివిధ రంగాల్లో ఉత్తమసేవలందిస్తున్న పలువురు మహిళలను సన్మానించారు. అసోసియేషన్ అధ్యక్షుడు కొండూరు సుబ్బారావు, వాకర్స్ ఇంటర్నేషనల్ ట్రెజరర్ నలుబోలు బలరామయ్యనాయుడులతో పాటు దాసరాజు సత్యనారాయణ, రావూరి సుబ్బారావు, జి.వి కృష్ణయ్య, రాచర్ల చక్రపాణి, ఇనుకొండ సోను, లాయర్ రమాదేవి, భారతి, సునీత, మల్లిక, సుప్రజ, ప్రమీల, గాయత్రి తదితర మహిళా సభ్యులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి సహకారం అందించిన టిఎల్ శరత్‌బాబును అందరూ అభినందించారు.

### చేనేతకారులకు
# మరిన్ని సదుపాయాలు సమకూర్చాలి
**- వెంకటగిరి ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డి**



ప్రపంచవ్యాప్తంగా ప్రసిద్ధిగాంచిన చేనేతపరిశ్రమ కనుమరుగు కాకుండా కాపాడుకోవాలని, ప్రభుత్వాలు చేనేత అభివృద్ధికి మరిన్ని సదుపాయాలు సమకూర్చాలని మాజీమంత్రి, వెంకటగిరి ఎమ్మెల్యే ఆనం రామనారాయణ రెడ్డి అన్నారు. ఇటీవల ఆయన వెంకటగిరి మునిసిపల్ కార్యాలయంలో మోటరైజ్డ్ లిఫ్టింగ్ మిషన్లను 70 మంది చేనేతకార్మికులకు అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వం చేనేత కారుల అభ్యున్నతికి ఎంతగానో కృషిచేస్తోందని, నేతన్న నేస్తం పథకం ద్వారా పేద చేనేతకార్మికులకు సాయం అందిస్తోందని చెప్పారు. కుటుంబ మంతా రోజంతా కష్టపడితేగానీ రెండువందల రూపాయలు కూడా రావడం లేదని అంటూ చేనేతకారుల కష్టాలు తీర్చేందుకు ప్రభుత్వాలు మరింతగా కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వెంకటగిరి మునిసిపల్ ఛైర్‌పర్సన్ భానుప్రియ, పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ వెంకటేశ్వరరావు, వైస్‌ఛైర్మెన్ బాలయ్య పాల్గొన్నారు.

# విశిష్ట సేవలకు విశేష గుర్తింపు
- నెల్లూరు రెడ్‌క్రాస్‌కు 'నాటా' అవార్డు
- సత్కారం అందుకున్న ఛైర్మెన్ చంద్రశేఖర్‌రెడ్డి


అవార్డు అందుకుంటున్న రెడ్‌క్రాస్ జిల్లా ఛైర్మెన్ చంద్రశేఖర్‌రెడ్డి

కరోనా కష్టకాలంలో బాధితులకు విశిష్టసేవలందించిన నెల్లూరు రెడ్‌క్రాస్‌కు మంచి గుర్తింపు లభించింది. నార్త్ అమెరికా తెలుగు అసోసియేషన్ (నాటా) వారు ప్రతిష్ఠాత్మకమైన 'కోవిడ్ వారియర్ అవార్డు'ను ప్రకటించి నెల్లూరు జిల్లా రెడ్ క్రాస్ ఛైర్మెన్ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డిని ఘనంగా సత్కరించారు. ఈనెల 6న హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే క్లబ్‌లో ఆయనకు ఆ అవార్డును ప్రదానం చేశారు. కోవిడ్ ఉధృతంగా వ్యాపిస్తున్న తరుణంలో బాధితులకు వైద్యసదుపాయాలు కలిగించడంలోనూ, ప్లాస్మా అందించడంలోనూ రెడ్‌క్రాస్ ఎనలేని కృషి చేసిన విషయం తెలిసిందే. కరోనా బాధితుల ప్రాణాలు కాపాడేందుకు ఎంతో అవసరమైన ఆక్సిజన్ కాన్సన్‌ట్రేటర్లను కూడా శక్తిమేరా అందించింది కూడా. అంతేకాదు, కోవిడ్‌తో చనిపోయిన వారికి అంత్యక్రియలు చేసేందుకు కుటుంబసభ్యులు కూడా రాలేని పరిస్థితుల్లో అలాంటి మృతదేహాలకు అంత్యక్రియలు నిర్వహించడం వంటివన్నీ రెడ్‌క్రాస్ ఎంతో సేవాభావంతో చేపట్టింది. లాక్‌డౌన్ సమయంలో కూడా వందలాదిమంది వలస కార్మికులకు ఆహారం అందించి తన మానవీయతను చాటుకుంది. ఈ నేపథ్యంలో నెల్లూరు రెడ్‌క్రాస్ చేస్తున్న సేవలను అమెరికాలోని 'నాటా' అసోసియేషన్ గుర్తించి ఈ అవార్డును ప్రదానం చేసింది. హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో ఆయనకు అవార్డునిచ్చి సత్కరించింది. ఈ సందర్భంగా నాటా ప్రతినిధి కోటిరెడ్డి మాట్లాడుతూ నెల్లూరు రెడ్‌క్రాస్ సేవలను ప్రశంసించారు. కోవిడ్‌తో మరణించినవారికి నెల్లూరు రెడ్‌క్రాస్ ఛైర్మెన్ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి కృషితో మొబైల్ క్రిమేషన్ మెషిన్‌తో అంత్యక్రియలు చేయడం ఎంతో అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో చంద్రశేఖర్ రెడ్డితో పాటు రాష్ట్ర రెడ్‌క్రాస్ ఛైర్మెన్ శ్రీధర్‌రెడ్డి, కోశాధికారి వెంకటేశ్వర్‌రెడ్డి, పశ్చిమ గోదావరి రెడ్‌క్రాస్ కమిటీ ఛైర్మెన్ కృష్ణారెడ్డి, నెల్లూరు జిల్లా రెడ్‌క్రాస్ ప్రతినిధులు రవిప్రకాష్, ప్రసన్నాంజనేయులు, బయ్యా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## రెడ్‌క్రాస్‌లో మహిళా దినోత్సవం

అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మార్చి 8న నెల్లూరు రెడ్‌క్రాస్ కార్యాలయంలో మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. విక్రమసింహపురి విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య జిఎం సుందరవల్లి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ మహిళలకు సమాజంలో సమాన ప్రాతినిధ్యం కల్పించడం వల్ల అన్ని రంగాల్లో మహిళలు అద్భుతమైన ప్రతిభతో రాణిస్తున్నారని అన్నారు. మహిళల అభ్యున్నతి కోసం ఉమెన్ ఎంపవర్‌మెంట్ అండ్ స్కిల్ డెవలప్‌మెంట్ ద్వారా మహిళలు స్వయం సాధికారతను సాధించవచ్చని రెడ్‌క్రాస్ జిల్లా ఛైర్మెన్ పి.చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా వివిధ రంగాల్లో విశేష సేవలందిస్తున్న పలువురు మహిళలకు ప్రతిఏటా రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో హ్యూమానిటీ అవార్డులను అందజేస్తున్నామన్నారు. ప్రజాసేవలో రెడ్‌క్రాస్ ప్రధానపాత్ర పోషిస్తోందని సెట్ జేడీ శ్రీలక్ష్మి ప్రశంసించారు. ఇంటర్నేషనల్ స్విమ్మర్ గోలి శ్యామల ప్రత్యేక అతిథిగా పాల్గొన్నారు. వివిధ రంగాల్లో విశిష్టసేవలందించిన వారికి రెడ్‌క్రాస్ తరఫున అవార్డులను ప్రదానం చేశారు. రెడ్‌క్రాస్ వైస్ ఛైర్మెన్ సుధీర్‌నాయుడు, కోశాధికారి సురేష్‌కుమార్‌జైన్, రాష్ట్ర సభ్యుడు రవిప్రకాష్, జిల్లా సభ్యులు దాసరి రాజేంద్రప్రసాద్, గునపాటి ప్రసాద్‌రెడ్డి, యడవల్లి సురేష్, అజయ్‌బాబు, టి.భాస్కర్‌రెడ్డి, వెంకురెడ్డి, మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

### నాయుడుపేటకు వచ్చిన
# శ్రీ స్వాత్మానందేంద్ర స్వామీజీ
**- స్వాగతం పలికిన ఎమ్మెల్యే కిలివేటి**



శ్రీకాళహస్తి నుంచి వెళ్తూ మార్గమధ్యంలో నాయుడుపేటలో కొలువైవున్న శ్రీదేవి భూదేవి సమేత శ్రీ కల్యాణ వెంకటేశ్వరస్వామి దర్శనార్థం ఇటీవల నాయుడుపేటకు వచ్చిన శారదాపీఠం ఉత్తరాధికారి శ్రీ స్వాత్మానందేంద్ర స్వామీజీకి సూళ్లూరుపేట ఎమ్మెల్యే, తిరుమల తిరుపతి దేవస్థానం పాలకమండలి సభ్యుడు కిలివేటి సంజీవయ్య ఘనంగా స్వాగతం పలికారు. ఆలయ ధర్మకర్త కామిరెడ్డి రాజారెడ్డి స్వామీజీని ఆలయ మర్యాదలతో స్వాగతించి ఆలయంలో స్వామివార్ల వద్ద పూజలు చేయించారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ వైస్‌ఛైర్మెన్ జలదంకి వెంకట కృష్ణారెడ్డి, కౌన్సిలర్లు పాలేటి నాగార్జున, పాపారెడ్డి చంద్రారెడ్డి, లక్ష్మీనారాయణరెడ్డి, కోఆప్షన్ సభ్యులు చదలవాడ కుమార్, వైకాపా నాయకులు కటకం జయరామయ్య, కామిరెడ్డి విజయులురెడ్డి, రాజేష్‌రెడ్డి, మోహన్, సురేష్‌రెడ్డి పాల్గొన్నారు.

### ఆకట్టుకుంటున్న
# ఎన్‌బికెఆర్ శిక్షణా తరగతులు
**- కొనియాడిన డాక్టర్ పి. చిన్నపరెడ్డి**



కోట మండలం విద్యానగర్‌లో ఉన్న ఎన్‌బికెఆర్ ఇంజనీరింగ్ ఇన్‌స్టిట్యూట్ నిర్వహిస్తున్న సదస్సులు, కార్యక్రమాలు అటు విద్యార్థులకు, ఇటు అధ్యాపకులకు కూడా ఎంతగానో ఉపయోగపడుతున్నాయని వక్తలు కొనియాడారు. ఇటీవల ఎన్‌బికెఆర్‌లో జాతీయస్థాయిలో వ్యాయామ అధ్యాపకుల కోసం ఏర్పాటుచేసిన 14 రోజుల శిక్షణ కార్యక్రమం అందరినీ బాగా ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న నేషనల్ అసోసియేషన్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ అండ్ స్పోర్ట్స్ సైన్స్ (ఎన్ఏపిఇఎస్ఎస్) డైరెక్టర్ డాక్టర్ పి.చిన్నపరెడ్డి మాట్లాడుతూ ఇంజనీరింగ్ కాలేజీలో వ్యాయామ విద్య అధ్యాపకుల అభివృద్ధికి సంబంధించిన కార్యక్రమాలు జరగడం ఇదే ప్రథమమని అన్నారు. అధ్యాపకులకు, విద్యార్థులకు ఇలాంటి శిక్షణా తరగతులు ఎంతో ఉపయోగపడతాయన్నారు. వ్యాయామ అధ్యాపకులు ఈ కార్యక్రమం ద్వారా తెలుసుకుంటున్న అనేక విషయాలను వారి ప్రాంతాల్లోని విద్యార్థులకు తెలియజెప్పి అవగాహన కలిగించాలన్నారు. ఎన్‌బికెఆర్ డైరెక్టర్ డాక్టర్ వి.విజయకుమార్‌రెడ్డి ఈ సందర్భంగా తమ కళాశాలలో చదువుకుంటూ విద్యలోనూ, క్రీడల్లోనూ రాణిస్తున్న విద్యార్థులను అభినందించారు. కళాశాల ఫిజికల్ డైరెక్టర్ డా.వి మల్లికార్జునరెడ్డితో పాటు డా.జి.హరినాథ్‌రెడ్డి, డా. రవీంద్ర రెడ్డి, డా.పివి సుబ్బారెడ్డి, డా.ఎన్ కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

# విజయపథంలో నెల్లూరీయులు


'లాయర్' పత్రిక 40వ వార్షికోత్సవం సందర్భంగా ప్రతిష్ఠాత్మకంగా ముద్రించిన 'విజయపథంలో నెల్లూరీయులు' కాఫీటేబుల్ బుక్‌ని ఈ నెల 5వ తేదీన తెలుగుదేశం పార్టీ పాలిట్‌బ్యూరో సభ్యులు, మాజీమంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డికి అందజేస్తున్న తుంగా శివప్రభాత్‌రెడ్డి (ప్రభు).

### కృష్ణపట్నం వద్ద..
# కార్గో హ్యాండ్లింగ్ సిమ్యులేటర్
**ప్రారంభించిన అదానీ నైపుణ్యాభివృద్ధి కేంద్రం**



కృష్ణపట్నం వద్ద ఉన్న అదానీ నైపుణ్యాభివృద్ధి కేంద్రం (ఏఎస్‌డిసి) ఆధ్వర్యంలో ఇటీవల కార్గో హ్యాండ్లింగ్ ఎక్విప్‌మెంట్ ట్రైనింగ్ సిమ్యులేటర్‌ను ప్రారంభించారు. దీంతో కృష్ణపట్నంలో మూడురకాల ఏఆర్ సిమ్యులేటర్లు, వాగన్ లోడర్, మొబైల్ క్రేన్, ఎర్త్ మూవింగ్ ఎక్విప్‌మెంట్ సిమ్యులేటర్లు అందుబాటులోకి వచ్చినట్లయింది.

ఇవి అత్యాధునిక శిక్షణ ఉపకరణాలను కలిగి ఉండడంతో పాటు ప్రభావవంతంగా ఆపరేటర్లకు సురక్షిత లోడింగ్, లిఫ్టింగ్, డిగ్గింగ్, డంపింగ్ సాంకేతికతల పట్ల తగు శిక్షణను కూడా అందించనున్నారు. నౌకాశ్రయాల వద్ద విధులు నిర్వహించే వారికి ఈ సిమ్యులేటర్లపై శిక్షణ ఇస్తే వారికి అవసరమైన నైపుణ్యాలను పొందడతోపాటు ఈ తరహా భారీ యంత్ర సామగ్రిని సురక్షితంగా నిర్వహించగలరని భావిస్తున్నారు. ఈ శిక్షణ కార్యక్రమాలతో ప్రమాదాలను గణనీయంగా తగ్గించడం ద్వారా ప్రాణనష్టం, ఆస్తినష్టం వంటివాటిని బాగా తగ్గించవచ్చని ఆశిస్తున్నారు. ఈ విప్లవాత్మక సాంకేతికతతో తమ ఆపరేటర్లకు అవసరమైన శిక్షణలను పోర్ట్‌ల వద్ద అందించేందుకు కూడా కృషి చేస్తున్నామని ఈ సందర్భంగా అదాని స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ జతిన్ త్రివేది చెప్పారు. ఈ కార్యక్రమంలో పోర్ట్స్ డైరెక్టర్ జిజె రావు, ఏకెపిఎల్ సిఇఓ అవినాష్‌చాంద్ రాయ్ తదితర ప్రముఖులు పాల్గొన్నారు.






# వేంకటేశ్వరస్వామి ఆలయ అభివృద్ధికి కృషి



సమావేశంలో మాట్లాడుతున్న ఆలయ ఛైర్మెన్ శ్రీకంటి రామ్మోహన్‌రావు మరియు కమిటీ సభ్యులు

**గూడూరు డివిజన్ వార్తలు**

గూడూరు శ్రీ ప్రసన్న వేంకటేశ్వర స్వామి ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని ఆలయ నూతన కమిటి ఛైర్మెన్ శ్రీకంటి రామ్మోహన్‌రావు అన్నారు. ఈ నెల 6వ తేదీ ఆలయ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే వరప్రసాదరావు సహకారంతో ఎంపిక చేసిన పాలకవర్గ సభ్యులు త్వరలో ప్రమాణస్వీకారం చేస్తారన్నారు. కమిటీ సభ్యులుగా సూరిశెట్టి హరికృష్ణ, అన్నం రఘురామయ్య, పద్మాల గోపాల్‌యాదవ్, బైనా కృష్ణవేణమ్మ, పాదర్తి వెంకటసుప్రజ, పంతగిరి విజయలను ఎంపిక చేశారన్నారు.

## శ్రీకంటికి సన్మానం

ఆలయ కమిటీ ఛైర్మెన్‌గా ఎన్నికైన సందర్భంగా శ్రీకంటి రామ్మోహన్‌రావును



గూడూరు ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సేవా సంఘం ఉపాధ్యక్షులు ఆనిమెళ్ళ శివ కుమార్, కార్యదర్శి చిట్టమూరు శ్రీనివాస రావు, సభ్యులు ఈనెల 8వతేదీన ఘనంగా సత్కరించి, అభినందనలు తెలిపారు.

# ది మదర్ ఆఫ్ ఆల్ జడ్జిమెంట్స్!






ఆంధ్ర రాష్ట్ర రాజధాని అమరావతిపై రెండున్నరేళ్లుగా నలుగుతున్న రాజకీయ వివాదం సన్న తుప్పరగా మొదలై... గాలి వానై, వాయు గుండమై, తుఫానై, చివరకు హైకోర్టు తీర్పుతో సునామీగా మారి రాష్ట్ర రాజకీయాన్ని చుట్టుముడుతున్నట్టు కనబడుతోంది. ది మదర్ ఆఫ్ ఆల్ జడ్జిమెంట్స్‌గా చెప్పదగిన ఈ తీర్పు ప్రభావం రాష్ట్ర ప్రభుత్వంపై తీవ్రంగా ఉంటుందనడంలో సందేహం లేదు. ఈ తీర్పు నేపథ్యంలో ప్రభుత్వం ఈ అమరావతి అంశాన్ని ఎలా హ్యాండిల్ చేస్తుందనేది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ పెద్ద చర్చనీయాంశం అయింది. ఈ తీర్పును అమలు చేయడమూ కుదరదు. అమలు చేయకుండా ఉండడమూ కుదరదు.

'రాజధానిగా అమరావతి' వివాదంలో హైకోర్టు అసాధారణ స్థాయిలో స్పందించింది. 'రిట్ ఆఫ్ మాండమస్'ను జారీచేసింది. అంటే ఒక నిర్దిష్ట కాల వ్యవధిని నిర్దేశిస్తూ ... ఆలోగా కోర్టు ఉత్తర్వులను అమలుచేయాలని ఆదేశించడమే దీనిలో ఇమిడి ఉన్న ప్రత్యేకత. 'రిట్ ఆఫ్ మాండమస్'ను సహజంగా హైకోర్టు గానీ సుప్రీం కోర్టు గానీ రొటీన్‌గా జారీ చేయవు. ఇద్దరు ప్రైవేట్ వ్యక్తులు /సంస్థల మధ్య వివాదం తల ఎత్తి, కోర్టుకు వస్తే ఏదో ఒక వ్యక్తి / సంస్థపై కూడా 'రిట్ ఆఫ్ మాండమస్'ను జారీ చేయడానికి వీలు లేదు.

కేవలం ప్రభుత్వాలు, ప్రభుత్వ సంస్థలు, పబ్లిక్ అథారిటీలపై మాత్రమే హైకోర్టులు గానీ, సుప్రీంకోర్టు గానీ ఈ రిట్ ఆఫ్ మాండమస్‌ను జారీ చేస్తాయి. ప్రభుత్వం గానీ మునిసిపల్ కార్పొరేషన్, మున్సిపాలిటీ వంటి ప్రభుత్వ వ్యవస్థలు గానీ చట్టబద్ధంగా చేయవలసి ఉన్న న్యాయాన్ని ఉద్దేశపూర్వకంగా గానీ, దురుద్దేశాలతో గానీ చేయడానికి విముఖంగా ఉన్న సందర్భాల్లో ఈ రిట్ ఆఫ్ మాండమస్‌ను ఉన్నత న్యాయస్థానాలు గానీ, సుప్రీంకోర్టు గానీ ప్రయోగించి ఆయా అధికార వ్యవస్థల మెడలు వంచుతాయి. అలాగే కింది కోర్టులు బాధితులైన వారికి న్యాయం చేయడంలో ఉద్దేశపూర్వకంగా చేయడంలేదని భావించిన సందర్భాలలో కూడా దిగువ కోర్టులకు సైతం రిట్ ఆఫ్ మాండమస్‌ను ప్రయోగించవచ్చు.

న్యాయపరమైన తీర్పులలో... ఏ హైకోర్టు అయినా జారీచేసే చిట్టచివరి 'ఆదేశమే' 'రిట్ ఆఫ్ మాండమస్'. కనుక ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం దీనికి ఎలా స్పందిస్తుందనేది ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. రాష్ట్ర ప్రభుత్వం సుప్రీం కోర్టుకు అప్పీల్‌కు వెళుతుందని కొందరు, వెళ్లదని కొందరు వాదిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ హైకోర్టు జారీచేసిన ఈ ఆదేశాలను చెప్పింది... చెప్పినట్టుగా... నిర్ణీత కాలవ్యవధిలోగా అమలు చేయకపోతే ప్రభుత్వ ప్రధానకార్యదర్శి కోర్టు ధిక్కారణకు పాల్పడినట్టేనని కూడా అంటున్నారు.

ఇక, రాజధాని... భూములు... విషయంలో సుమారు 164మంది రైతులు, ఇతరులు దాఖలుచేసిన పిటిషన్లను సుదీర్ఘంగా విచారించి రెండు పక్కాల న్యాయవాదుల వాదనలు రోజులు తరబడి విన్న తరువాత ఫిబ్రవరి మూడవ తేదీన 'రిట్ ఆఫ్ మాండమస్'ను ముగ్గురు న్యాయమూర్తుల ధర్మాసనం జారీ చేసింది.

జగన్ ప్రభుత్వం వచ్చిన ఈ రెండున్నరేళ్ల కాలంలో జగన్ ప్రభుత్వ నిర్ణయాలపై హైకోర్టులో దాఖలయిన దాదాపు రెండు వందల పిటిషన్లలో కేవలం తీర్పులు మాత్రమే వెలువడ్డాయి కానీ, రిట్ ఆఫ్ మాండమస్ జారీ కాలేదు. ఇది అనుల్లంఘనీయమైన ఆదేశం.

అమరావతి మాస్టర్ ప్లాన్ ప్రకారం, అమరావతి ప్రాంతాన్ని ఆరు నెలలలోగా అభివృద్ధి చేయాలని, మౌలిక సదుపాయాలతో అభివృద్ధి చేసిన వాణిజ్య ప్లాట్లను రాజధాని నిర్మాణానికి భూములిచ్చిన సుమారు 20 వేల మందికి పైబడిన రైతులకు మూడు నెలలలోగా అప్పగించాలని, ఈ భూములను రాజధాని పనులకు తప్ప ఇతర పనులకు కేటాయించగూడదని, తాకట్టు పెట్టగూడదని అంటూ 307 పేజీల తీర్పును వెలువరించింది. ఇది ఒక అసాధారణమైన, స్పష్టమైన తీర్పు అనడంలో సందేహం లేదు. మన న్యాయవ్యవస్థ తీర్పుల చరిత్రలో నిలిచిపోయే తీర్పు ఇది.

రైతులు, ఇతరులు దాఖలు చేసిన ఈ పిటిషన్లలో ప్రతివాది ముఖ్యమంత్రి కాదు. ప్రభుత్వాల చర్యలకు చట్ట ప్రకారం రాజకీయ నేతలకు బాధ్యులు కారు. ప్రభుత్వ అధికారులే బాధ్యత వహించాలి. ప్రభుత్వ కార్యదర్శి, లేదా ప్రధానకార్యదర్శి పేరిట జీ.ఓలు జారీ అవుతాయి కనుక పాలనలోని తప్పొప్పులకు వారే బాధ్యులు. ఈ కేసులో కోర్టు ఆదేశాలను అమలు చేయాల్సింది ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి. ఒకవేళ 'కోర్టు ధిక్కరణ'... అనే పరిస్థితే తల ఎత్తితే ఆరోజు నాటికి ఎవరు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా ఉంటే వారు మాత్రమే హైకోర్టు మెట్లు ఎక్కాల్సి ఉంటుంది. దేశంలోని ఏ న్యాయస్థానం అయినా అమలులో ఉన్న చట్టాలు, గత తీర్పులు, రాజ్యాంగ నిబంధనలు ప్రాతిపదికగా తీర్పులు ఇస్తూ ఉంటుంది. రాజకీయ నాయకులేమో తమ తమ రాజకీయ అవసరాలు, ప్రయోజనాలు, దృక్పథాల ఆధారంగా అభిప్రాయాలు వెల్లడిస్తూ ఉంటారు. ఇప్పుడు ఈ తీర్పు అమలుకు ప్రభుత్వ ఆర్థిక పరిస్థితులు సహకరించవు అనేది ఒక కారణం అయితే, అమరావతిని రాజధానిగా ప్రకటించడం పట్ల ప్రభుత్వానికి ఏమాత్రం ఆసక్తి లేదనేది అతి ప్రధానమైన రెండో కారణం.

## అడ్వాంటేజ్ చంద్రబాబు!

నిజానికి, అమరావతిని రాజధానిగా సర్వాంగ సుందరంగా మాస్టర్‌ప్లాన్ ప్రకారం అభివృద్ధి చేసినా అలా బీడు భూములుగా వదిలేసినా ముఖ్యమంత్రి జగన్ కంటే మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడికే పొలిటికల్ మైలేజ్ ఎక్కువగా లభిస్తుంది.

అమరావతి అనేది చంద్రబాబు మానస పుత్రిక. అందువల్ల ఇంత అల్లరి, రభస.... రభస, రగడ... రగడ, రచ్చ... రచ్చ... జరిగిన తరువాత ఇప్పుడు దానిని అభివృద్ధి చేసినప్పటికీ జగన్‌కు ఇక గత్యంతరం లేక అభివృద్ధి చేశారనే ప్రచారం ఊపందుకుంటుంది. చంద్రబాబుదే ఈ క్రెడిట్ అనే భావన జనంలోకి బలంగా వెళ్ళిపోతుంది.

అలా కాదు అని చెప్పి, దానిని ఇప్పటిలాగానే వదిలేసినప్పటికీ చంద్రబాబుకే పొలిటికల్ మైలేజ్ లభిస్తుంది. చంద్రబాబు వస్తే తప్ప అమరావతి అభివృద్ధి చెందదు అనే భావన రాష్ట్ర వ్యాపితమవుతుంది. అయితే.. మూడు రాజధానులే తమ విధానం అని మంత్రి బొత్స సత్యనారాయణ, ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి, ఒకరిద్దరు మంత్రులు ఇప్పటికే ప్రభుత్వ మాటగా ప్రకటించారు. నేతల అభిప్రాయాలతో కోర్టుకు సంబంధం లేదు. అందువల్ల రాష్ట్ర హైకోర్టు జారీచేసిన 'రిట్ ఆఫ్ మాండమస్'ను పట్టించుకోకుండా ఉండడం కూడా ప్రభుత్వానికి కుదరదు. ఈ ఆదేశాలను ఏదో విధంగా ప్రభుత్వం అధిగమించాల్సి ఉంది. కోర్టు ఆదేశాలను పట్టించుకోకపోవడం అంటే 'రూల్ ఆఫ్ లా'ను ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే విస్మరించడం అనే సూత్రీకరణకు అవకాశాలు లేకపోలేదని కొందరు న్యాయవాదులు ఓ అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

కోర్టు విధించిన గడువులోపు కోర్టు ఆదేశించిన విధంగా పనులు పూర్తి చేయడం అనేది ప్రభుత్వానికి




రాజ్యాంగ విధి. లేకపోతే కోర్టు తీవ్రంగా స్పందించే పరిస్థితి ఉంది. కానీ, ఆర్థిక సమస్యలతో పాటు కోర్టు నిర్దేశించిన కాల వ్యవధుల గడువు రీత్యా కూడా... కోర్టు ఆదేశాలను అమలు చేయడం అసంభవం. హైకోర్టు తీర్పుపై సుప్రీంలో అప్పీల్‌కు వెళతామని హోంమంత్రి ఎం.సుచరిత ప్రకటించారు కూడా. దీనివల్ల యథాస్థితి కొనసాగించే వెసులుబాటు ప్రభుత్వానికి లభిస్తుందేమో చూడాలి. ఈలోగా అసెంబ్లీ ఎన్నికలు వస్తాయి. మూడు రాజధానుల అంశానికి ప్రజల ఆమోదం తీసుకుని ఎన్నికలకు వైసీపీ వెళ్ళవచ్చు. అనంతరం ప్రభుత్వం ఏర్పాటు చేశాకే ఈ సమస్యను శాశ్వతంగా పరిష్కరించవచ్చు అని ప్రభుత్వ పెద్దల ఆలోచనగా ఉందంటూ కొన్ని వ్యాఖ్యానాలు చెవిన పడుతున్నాయి .

అయితే, ఈ అసెంబ్లీని రద్దుచేసి, మళ్ళీ ఎన్నికలకు వెళ్లి, మళ్ళీ 150 సీట్లో... అంతకంటే ఎక్కువో గెలిచినప్పటికీ అసెంబ్లీకి ఈ ఒక్క విషయంలో శాసనాధికారమే లేదన్న హైకోర్టు తీర్పును కాదని మూడు రాజధానుల బిల్లును అసెంబ్లీలో ఎలా ఆమోదిస్తారు అనేది... ప్రస్తుతానికి సమాధానం లభించని ప్రశ్న అని పలువురు అభిప్రాయపడుతున్నారు. అయితే, పార్లమెంట్ ఆమోదించిన విభజన చట్టంలోని 'The Capitol' అనే పదానికి బదులు CAPITOL(S) అనే పదం వాడుతూ రాష్ట్ర విభజన చట్టానికి సవరణ చేయాలని కోరుతూ శాసనసభ పార్లమెంట్‌కు విజ్ఞప్తి చేస్తూ తీర్మానం ఆమోదించి లోకసభ స్పీకర్‌కు పంపవచ్చునని న్యాయవాదులు కొందరు సూచిస్తున్నారు.

వైసీపీతో కేంద్ర బీజేపీ పాలకులకు ముందు ముందు చాలా రాజకీయ అవసరాలు ఉన్నందున, పార్లమెంటులో విభజన చట్టానికి కేంద్రం సవరణ చేసినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వానికి ఉపశమనం లభించే అవకాశం కనిపించడం లేదు. 'రాజధాని'ని అమరావతి నుంచి వైజాగ్‌కు తరలించవచ్చునని అనుకున్నప్పటికీ సీఆర్‌డీఏ చట్టం ప్రకారం అమరావతిని అభివృద్ధి చేసి రైతులకు ప్లాట్లు అప్పగించాల్సిందే. రైతులు ఇచ్చిన భూములను మాస్టర్‌ప్లాన్ ప్రకారం అభివృద్ధి చేయాల్సిందే.

మధ్యంతర ఎన్నికలకు వెళ్లి, మళ్ళీ 150 సీట్లకు పైబడి గెలిచినా హైకోర్టు తీర్పు నుంచి ఉపశమనం లభించదు.. ఇక, సుప్రీంలో అప్పీల్ విషయానికి వస్తే మామూలు రిట్ పిటిషన్లలో హైకోర్టుల తీర్పులపై స్టే ఇచ్చినంత సులభంగా 'రిట్ ఆఫ్ మాండమస్' లలో సుప్రీంకోర్టు స్టే ఇస్తుందా అనే సందేహం చాలామందిలో ఉంది. అసలు హైకోర్టు ఇంత సీరియస్‌గా ఎందుకు స్పందించింది అనే అంశాన్ని సుప్రీం కోర్టు చాలా లోతుగా పరిశీలిస్తుందని అంటున్నారు.

దీనికితోడు, హైకోర్టులో ప్రభుత్వానికి వ్యతిరేకంగా పిటిషన్లు దాఖలుచేసిన 164 మందిలో ఏ ఒక్కరైనా సుప్రీం కోర్టులో ఈ అంశంపై కేవియేట్ దాఖలు చేసివుంటే మొత్తం 164 మంది పిటిషన్ దారులకు కూడా నోటీసులు ఇవ్వాల్సి ఉంటుంది.

వారు అఫిడవిట్లు దాఖలు చేయాలి. వారి తరఫు న్యాయవాదుల వాదనలు వినాలి. అప్పుడే, స్టే ఇవ్వాలో... వద్దో... సుప్రీంకోర్టు ఆలోచిస్తుంది. ఇదో సుదీర్ఘ న్యాయ ప్రక్రియ.

ఇది ఒక కొలిక్కి వచ్చేలోపు రాష్ట్ర హైకోర్టు విధించిన గడువు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కార్యాలయ ముంగిట్లోకి వచ్చేస్తుంది.

ఇన్ని సంక్లిష్ట న్యాయ, ఆర్థిక, రాజకీయ పరిస్థితులను జగన్ ప్రభుత్వం ఈ మూడేళ్లలో దాదాపు మొదటిసారిగా ఎదుర్కొంటున్నది. హైకోర్టు తీర్పుపై రాష్ట్ర ప్రభుత్వ వైఖరి ఎలా ఉన్నప్పటికీ, 'రాజధానిగా అమరావతి' అనే అంశాన్ని ఒక బలమైన భావోద్వేగ ఎన్నికల అంశంగా మార్చేందుకు ఒక గట్టి పునాది పడింది. ఒకవేళ... రాష్ట్ర ప్రభుత్వం.. సుప్రీంకోర్టులో అప్పీల్‌కు వెళితే అక్కడ స్టే లభించినప్పటికీ ఇది ఎన్నికల భావోద్వేగ అంశంగానే ఉంటుంది. ఎందుకంటే... మూడు రాజధానుల ఏర్పాటుకు సంబంధించిన ఎటువంటి చట్టం ఇప్పుడు ఉనికిలో లేదు. సుప్రీంలో పూర్తిగా తేలకుండా కొత్తగా చట్టం చేయడానికి వీలు లేదు. అయితే, అనేక సమస్యల నుంచి సునాయాసంగా తమ నాయకుడు బయటపడుతున్నట్టే ఈ చిక్కు సమస్య నుంచి విజయవంతంగా బయటపడతారని జగన్ అభిమానుల నమ్మకంగా కనపడుతోంది.

**- భోగాది వేంకట రాయుడు**
bhogadirayudu2152@gmail.com

# నెరసం ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం



అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా నెల్లూరు జిల్లా రచయితల సంఘం (నెరసం) ఆధ్వర్యంలో మహిళా దినోత్సవ కార్యక్రమం నిర్వహించారు. స్థానిక మల్లెల సంజీవయ్య నగరపాలక ఉన్నత పాఠశాలలో జరిగిన ఈ కార్యక్రమంలో వివిధ రంగాలలో కృషి చేసిన మహిళలను సన్మానించారు. ప్రముఖ కవయిత్రి పాతూరి అన్నపూర్ణ మహిళా దినోత్సవం ప్రాముఖ్యతను వివరించారు. ములుగు లక్ష్మీ మైథిలి, సోలా జానకి, సందడి అరుణ, సయ్యద్ నజ్మా బేగంలను సన్మానించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పి.హైమవతి, విశ్రాంత ప్రధానోపాధ్యాయురాలు ఎన్.జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. అనంతరం విద్యారంగంలో విశేష ప్రతిభ కలిగిన బాలికలకు ప్రశంసాపత్రాలు బహూకరించారు.

## జాతీయస్థాయి బ్యాడ్మింటన్ పోటీలకు..

# వెంకటగిరి విద్యార్థులు



పోటీలకు ఎంపికైన గురుప్రసాద్, ధనుష్

జాతీయస్థాయిలో మార్చి 10 నుంచి 16వ తేది వరకు చెన్నైలో జరుగనున్న బాల్‌బ్యాడ్మింటన్ పోటీలకు వెంకటగిరిలోని విశ్వోదయ డిగ్రీకళాశాల విద్యార్థులు గురు ప్రసాద్, ధనుష్‌లు ఎంపిక కావడం పట్ల ప్రిన్సిపాల్ అరుణ్‌కుమార్ సంతోషం వ్యక్తం చేశారు. ఇటీవల కళాశాలలో జరిగిన కార్యక్రమంలో వారిద్దరినీ అభినందించారు. ఫిజికల్ డైరెక్టర్ వీరేంద్రబాబు, అధ్యాపకులు పాల్గొని వారిని అభినందించారు. జాతీయస్థాయిలో వారు తప్పకుండా విజయం సాధిస్తారని అందరూ ఆకాంక్షించారు.

# గండవరం ఉదయకళేశ్వరునికి.. 22 లక్షల ఆదాయం

కొడవలూరు మండలంలోని గండవరంలో వెలసివున్న గంగా పార్వతీ సమేత శ్రీ ఉదయకళేశ్వరస్వామి వారి ఆలయంలో ఇటీవల హుండీ లెక్కింపు జరిగింది. ఈ ఏడాది బ్రహ్మోత్సవాలకు సంబంధించి దర్శన టికెట్లు, హుండీ ఆదాయం, దుకాణాల ద్వారా వచ్చిన మొత్తం అంతా కలిపి 22,17,250 రూపాయల దాకా ఆలయానికి రాబడి వచ్చిందని ఆలయ వర్గాలు తెలిపాయి. ఆలయ అధికారులు, పాలకవర్గ సభ్యులు, అర్చకులు ఈ లెక్కింపులో పాల్గొన్నారు.

హమ్మయ్య!..

# ఉక్రెయిన్ నుంచి మన జిల్లావాళ్ళంతా వచ్చేశారు

- 31 మంది క్షేమంగా ఇల్లు చేరారు
- బిడ్డలను చూసి తల్లితండ్రుల ఆనందం

***నెల్లూరు జిల్లానుంచి వైద్యవిద్యకోసం ఉక్రెయిన్ వెళ్ళిన మొత్తం 31 మంది విద్యార్థులు ఎట్టకేలకు క్షేమంగా ఇల్లు చేరడంతో వారి తల్లితండ్రులు, కుటుంబ సభ్యుల సంతోషానికి కొదవలేదు. ఉక్రెయిన్‌లో రష్యా దాడులతో.. యుద్ధభీభత్సంతో భీతావహ పరిస్థితుల నెలకొన్న నేపథ్యంలో తమ స్వస్థలాలకు తిరిగి చేరతామో లేదో అని ప్రాణాలు అరచేతుల్లో పెట్టుకుని బిక్కుబిక్కుమంటూ గడిపారు. ఆ యుద్ధవాతావరణంలో తమ బిడ్డల పరిస్థితి ఏమవుతుందోనని ఇక్కడ తల్లితండ్రులు పడిన వేదన అంతా ఇంతా కాదు.***

మొత్తమ్మీద కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల చొరవ, సాయంతో మన జిల్లా విద్యార్థులు ఆ దేశం నుంచి బయటపడ్డారు. ఉక్రెయిన్‌లో రష్యాదాడులు ప్రారంభమైనప్పటి నుంచి అక్కడున్న మన విద్యార్థులను జిల్లాకు తిరిగి తీసుకువచ్చేందుకు అధికారులు శరవేగంగా ప్రణాళికలు సిద్ధం చేశారు. ప్రభుత్వాల ఆదేశాలతో జిల్లా అధికారయం త్రాంగం అప్రమత్తమైంది. ఉక్రెయిన్‌లో జిల్లాకు చెందిన విద్యార్థులు ఎంతమంది వెళ్ళారో వెంటనే వివరాలు తెలుసుకున్నారు. అడ్రసులు సేకరించి వారందరి అధికారులు వెళ్లి ధైర్యం చెప్పారు. ఆ వివరాలన్నిటి కేంద్ర రాష్ట్రప్రభుత్వాలకు పంపారు. యుద్ధప్రాతిపదికన చేసిన ఏర్పాట్లతో ఉక్రెయిన్‌లో ఉన్న జిల్లా విద్యార్థులను జిల్లాకు సురక్షితంగా తిరిగి వచ్చేలా చర్యలు తీసుకోవడం పట్ల సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. ఈ సందర్భంగా కలెక్టర్ చక్రధర్‌బాబు మాట్లాడుతూ ఈ నెల 7వ తేదీకల్లా 31 మంది విద్యార్థులు జిల్లాలోని స్వస్థలాలకు చేరుకున్నారని, తహశీల్దార్లు, ఇతర అధికారులు వారిని వాళ్ళ తల్లితండ్రుల వద్దకు చేర్చారని తెలిపారు. దీంతో విద్యార్థులు, తల్లితండ్రులు ఎంతో సంతోషంగా కలెక్టర్‌కు, జిల్లా అధికారయంత్రాంగానికి, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు తమ కృతజ్ఞతలు వెల్లడించారు.

## నల్లగొండ్ల లక్ష్మీనృసింహాలయం

# ఛైర్మెన్‌గా..మోహన్‌రెడ్డి

ప్రముఖ పుణ్యక్షేత్రమైన వింజమూరు మండలంలోని నల్లగొండ్లలో వెలసివున్న శ్రీ గుహామల్లీశ్వర లక్ష్మీనరసింహస్వామి దేవస్థానానికి ఇటీవల కొత్త పాలకమండలి ఏర్పాటైంది. ఛైర్మెన్‌గా అన్నపురెడ్డి మోహన్‌రెడ్డి నియమితులయ్యారు. ఆలయ ప్రాంగణంలో ఇ.ఓ మల్లికార్జునరెడ్డి ఇటీవల నూతన పాలకమండలి ఛైర్మెన్‌ను సభ్యులను ఆహ్వానించి ప్రమాణస్వీకారం చేయించారు. తొలుత ఆలయ అర్చకులు స్వామివారి ఆలయంలో ప్రత్యేకపూజలు, అభిషేకాలు చేసి అందరికీ దైవదర్శనం కల్పించారు. తిరుమల వేదపండితుడు తనూజ్ విష్ణువర్ధనాచార్యులు, స్థానిక నాయకులు, పెద్దసంఖ్యలో ప్రముఖులు, ప్రజలు పాల్గొన్నారు.

# పల్లెల్లో ప్రతి ఇంటికీ కుళాయి

జలజీవన్ మిషన్ కార్యక్రమం ద్వారా జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి ఇంటికీ మంచినీటి కుళాయి కనెక్షన్ ఏర్పాటుచేయాలని జిల్లా కలెక్టర్ కెవిఎన్ చక్రధర్‌బాబు ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులను ఆదేశించారు. ఇటీవల ఆయన నెల్లూరులోని తన క్యాంప్ కార్యాలయంలో ఆర్‌డబ్ల్యుఎస్ ఇంజనీర్లతో సమావేశమయ్యారు. ఏప్రిల్ నెలాఖరులోగా నూటికి నూరుశాతం లక్ష్యాన్ని సాధించాలని, కుళాయి కనెక్షన్లు ఇవ్వడంతో పాటు నాణ్యమైన మంచినీటి సరఫరాకు చర్యలు తీసుకోవాలని ఆయన వారికి స్పష్టం చేశారు. జలజీవన్ మిషన్ పథకం పురోగతిని ఆయన సమీక్షిస్తూ ఇప్పటిదాకా జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో 70శాతం ఇళ్ళకు మంచినీటి కుళాయి కనెక్షన్లు ఇవ్వడం జరిగిందని, త్వరితగతిన పూర్తిస్థాయి లక్ష్యాన్ని సాధించాలని చెప్పారు. ప్రతి వారం మంచినీటి శ్యాంపిల్స్ తీయాలని, ఎన్ని కుళాయి కనెక్షన్లు ఇచ్చారో ఎప్పటికప్పుడు తనకు నివేదికలు పంపాలని తెలిపారు. లక్ష్యసాధనంలో అలసత్వం ప్రదర్శిస్తే చర్యలు తప్పవన్నారు. రానున్న వేసవిని దృష్టిలో పెట్టుకుని మంచినీటికి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. అదేవిధంగా పెండింగ్‌లో ఉన్న మరుగుదొడ్ల నిర్మాణాలు వెంటనే పూర్తిచేసేందుకు అధికారులు శ్రద్ధ తీసుకోవాలన్నారు. ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇ శ్రీనివాస కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# బాధలు బాపే దేవుడు.. 'గూడూరు' సాయినాథుడు

*బ్రహ్మానందం పరమసుఖదం*
*కేవలం జ్ఞానమూర్తిం*
*ద్వంద్వాతీతం గగన సదృశం*
*తత్త్వమస్యాది లక్ష్యం*
*ఏకం నిత్యం విమలమచలం సర్వధీసాక్షిభూతం*
*సాయినాథం త్రిగుణరహితం*

***సద్గురుం.. తమ్ నమామి!..*** అంటూ ... సాయి భక్తులు నిండుమనసుతో అనునిత్యం ఆ సద్గురుదేవుని సేవిస్తుంటారు. పిలిచిన పలికే దేవుడిగా, భక్తుల బాధలు తీర్చే ఆపద్బాంధవుడిగా శ్రీ సాయినాథుడు ప్రసిద్ధి. శాంతి-సబూరి అంటూ విశ్వశాంతిని, లోకకల్యాణాన్ని ఆకాంక్షిస్తూ, సహనశీల తను, సన్మార్గాలను, మంచిని-మానవత్వాన్ని ప్రబోధిస్తూ, తన మహిమలు, బోధనలతో సకల మానవాళికి మార్గదర్శకం చేసిన దివ్యమూర్తి శ్రీ షిరిడీ సాయిబాబా. భక్తుల గుండెగుడుల్లో కొలువుదీరిన ఆ కరుణామయునికి గూడూరులోనూ ఎంతోకాలం క్రితం ఒక భక్తుడు అత్యద్భుతమైన రీతిలో ఆలయం కట్టించి పూజలు చేయడం ప్రారంభించారు. 82 ఏళ్ళ క్రితం కట్టిన ఆ అపురూపమైన ఆలయం.. జిల్లాలోని తొలినాళ్ళ సాయి దేవాలయాల్లో ప్రధానమైనది కూడా.

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరుజిల్లా గూడూరులోని నరసింగరావుపేటలో దత్తావతార స్వరూపుడైన శ్రీ షిరిడీ సాయినాధుని దివ్యమైన మందిరం ఉంది. 1940వ సంవత్సరంలో సాయిభక్తులైన భాస్కరం రమణయ్య-సుబ్బమ్మ దంపతులు శ్రీ సాయినాధునిపై అచంచల భక్తితో తమ స్వస్థలంలో సర్వాంగ సుందరంగా ఆలయం నిర్మించి పూజలు చేయడం ప్రారంభించారు. ఆలయ గర్భగుడిలో నల్లరాతితో అత్యంత అద్భుతంగా తీర్చిదిద్దినట్లుండే మూలవిరాట్టు.. నల్లరాతి విగ్రహమూర్తిగా దర్శనమిచ్చే ఈ ఆలయం సాయిబాబా దేవాలయాల్లో ఎంతో అరుదైనదని కూడా అంటారు. ఆ తర్వాత 1944లో ఆలయ





## మన దేవాలయాలు (90)

గోపురం, 1946లో మండపం నిర్మించారు. ఆ ఆలయం అచిరకాలంలోనే మంచి ప్రసిద్ధిలోకి వచ్చింది. శ్రీ సాయినాధుని దర్శించుకున్న భక్తుల కోరిన కోర్కెలు నెరవేరడం, కష్టాలు తీరడం, ఆపదలు తొలగిపోవడం, అనుకున్న కార్యాలను సాధించగలగడం, వివాహం, సంతానప్రాప్తి వంటివన్నీ జరుగుతుండడంతో ఆలయం భక్తుల రాకపోకలతో కళకళలాడింది.

### 2002లో పాలరాతి విగ్రహం :

ఈ ఆలయంలో నిత్యపూజలు సేవలతో పాటు ఆలయ నిర్వహణనంతా ఇటీవల దాకా రమణయ్య కుటుంబసభ్యులు నిర్వహించేవారు. ఆలయాన్ని కంటికిరెప్పలా చూసుకునేవారు. కాలక్రమేణా ఆలయం పాతబడడంతో రమణయ్య మనుమడు విష్ణు ఆలయ నిర్వహణ బాధ్యతలను 'శ్రీ గురుసాయి మందిర కమిటీ'కి అప్పగించారు. భక్తులు, దాతలు, స్థానిక ప్రజలందరి సహకారంతో కమిటీ వారు ఆ మందిరం స్థానంలో కొత్త ఆలయాన్ని మరింత అద్భుతంగా నిర్మించి బాబాపై తమకున్న భక్తిప్రపత్తులను చాటుకున్నారు. 2012 ఏప్రిల్ 26న ఆలయ పునర్నిర్మాణానికి శంకుస్థాపన జరిగింది. గర్భగుడిలోని నల్లరాతి విగ్రహం చెంతనే సుప్రశాంత వదనంతో అలరారుతున్న సాయినాధుని పాలరాతి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. 2014 జూన్ 22న కుర్తాళం సిద్ధేశ్వర పీఠం ఆస్థానపండితులు బ్రహ్మశ్రీ మాచవోలు రాజశేఖరశాస్త్రి నేతృత్వంలో, అవదూత శ్రీ గట్టుస్వామి సారధ్యంలో వైభవంగా విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం, మహా కుంభాభిషేకం జరిగాయి.

### నిత్యపూజలు..సేవలు :

శ్రీ సాయినాధునికి నిత్యపూజలు, సేవలు, ఆరతులు నిరంతరం వైభవోపేతంగా జరుగుతున్నాయి. మందిరం కమిటీ వారి ఆధ్వర్యంలో, సాయిభక్తులైన గురుగుహ సారధ్యంలో స్వామి వారి పూజలకు, సేవలకు ఏ లోటూ లేదు. ప్రతిఏటా గురుపూర్ణిమ ఉత్సవాలు, దత్తజయంతితో పాటు శ్రీరామనవమి వంటి పండుగల రోజుల్లోనూ శ్రీ స్వామివారికి విశిష్టపూజలు, విశేష సేవలు జరుగుతుంటాయి. ప్రతి బుధవారం సత్సంగం, గురువారం పల్లకిసేవ ఉంటాయి. శ్రీస్వామివారే రమణయ్య కుటుంబసభ్యులకు ఓసారి స్వప్నదర్శనమిచ్చి 'మాఘ శుద్ధ తదియ రోజున తన పుట్టినరోజు' అని చెప్పడంతో నాటి నుంచి ప్రతిఏటా అదేరోజున శ్రీసాయినాధుని జయంతి వేడుకలు ఘనంగా జరుపుతుంటారు. బాబా అనుగ్రహం కోసం ఈ ఆలయానికి వచ్చే భక్తుల సంఖ్య కూడా ఇటీవలికాలంలో గణనీయంగా పెరిగింది.

## అడుగడుగునా అక్రమ నిర్మాణాలు, మురుగు గుంటలుగా మారిన ఖాళీ స్థలాలు, కోట్లకొద్దీ పుట్టుకొస్తున్న దోమలు, గుంతలమయమైన రోడ్లు, అస్తవ్యస్తమైన ట్రాఫిక్‌తో అవస్త... అచేతనంగా అధికార వ్యవస్థ... 'ఇదీ నెల్లూరు'

# నగరం కాదు నరకం

## నడ్డి విరిచే వడ్డీతో పన్నుల కలెక్షన్.. వసూళ్ళలో టాప్ - వసతులలో ఫ్లాప్



ఇల్లు కడుతున్నారా...? లేక షాపింగ్ కాంప్లెక్స్ కడుతున్నారా..?? లేదంటే కొత్తగా అపార్ట్‌మెంట్ సముదాయం నిర్మిస్తున్నారా??? ఇవన్నీ కాదు.. కొత్తగా లే-అవుట్ వేస్తున్నామంటారా... అయితే మీకు ప్రభుత్వ శాఖల నుండి ఎలాంటి అనుమతులూ అక్కరలేదు. అరెరే.... ఇదేంటబ్బా అని ఆశ్చర్యపోకండి. ఇది నిజం, నమ్మలేని నిజం. మీ ప్రాంతంలోని అధికారపార్టీ నేతలను ప్రసన్నం చేసుకోండి చాలు. అదే మీకు ప్రభుత్వానుమతుల రబ్బర్ స్టాంపు లాంటిది. మూడు అంతస్తులకు అనుమతులు తీసుకుని ఆరు అంతస్తులు కట్టుకోవచ్చు. మీకు అవకాశం ఉంటే రోడ్డుని సైతం ఆక్రమించి భవనం నిర్మించుకోవచ్చు. ఇంకా చాలా చేయొచ్చు.

నేతల ఆశీస్సులు ఉంటే అధికారులు మీ జోలికి రారు. ఎందుకంటే వాళ్ళకంత సీన్‌లేదు. ఇది ఇప్పటి సంప్రదాయం, సంస్కృతీ కాదు. అనాదిగా నగరంలో వస్తున్న ఆనవాయితీ. ఈ సంప్రదాయానికి పలానా పార్టీ అధికారంలో ఉండాలన్న పనే లేదు. అధికారపార్టీ ఏదైనా నేతల తీరుమాత్రం ఇదే. కాకపొతే గతంలో పెద్ద పెద్ద నిర్మాణాలూ, లే-అవుట్లకు మాత్రమే ఈ నియమం ఉండేది. ఇప్పుడు చిన్న టీ బంకు పెట్టుకోవాలన్నా ప్రజాప్రతినిధిని ప్రసన్నం చేసుకోవాల్సిందే.

నెల్లూరంటే నెల్లూరే! నెల్లూరుజిల్లాకి భారతదేశంలోనే గుర్తింపు ఉంది. నాటి తరం నుండి నేటి తరం వరకు ఉద్దండులైన రాజకీయ నేతలు దేశ రాజధానిలో ఢిల్లీలో చక్రం తిప్పి.. ఔరా నెల్లూరీయులు అనిపించారు. నాటితరంలోని బెజవాడ గోపాలరెడ్డి మొదలు ప్రస్తుత భారత ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడుతో సహా ఎంతోమంది నెల్లూరీయులు దేశ స్థాయిలో నెల్లూరు పేరు మారుమ్రోగించిన వారే. వ్యాపార, పారిశ్రామిక, సేవ, సామాజిక రంగాలలో కూడా నెల్లూరోళ్లకు ఒక ప్రత్యేక గుర్తింపు ఉంది. అంతర్జాతీయ స్థాయిలో సైతం నెల్లూరీయులంటే మామూలోళ్ళు కాదన్న నానుడి ఉంది. అలాంటి నెల్లూరు జిల్లా కేంద్రమైన నెల్లూరు నగరం అభివృద్ధి పరంగా నిరాదరణకు గురవుతూనే ఉంది. దశాబ్దాల చరిత్ర ఉన్న నెల్లూరు నగరంలో భారీ వర్షాలు కురిస్తే రైలుకట్టకు ఇరు వైపులా ఉన్న నగరవాసులు ఎటువైపు వారు అటువైపే ఉండాల్సిన పరిస్థితి ఈనాటికీ ఉందంటే నెల్లూరు నగరం కాదు... నరకం అనడానికి ఇంతకంటే ఉదాహరణ అవసరం లేదు.

### అధికారులంతా డమ్మీలే..

నగరంలో దశాబ్దాల కాలంగా రాజకీయ నాయకుల ఆధిపత్యం కొనసాగుతోంది. వారి ముందు అధికారులు దిష్టిబొమ్మలే. నగరం మున్సిపాలిటీగా ఉన్న సమయంలో ఉన్న కమిషనర్లైనా, కార్పొరేషన్‌గా స్థాయి పెరిగిన తరువాత వచ్చిన ఐఏయస్ అధికారులైనా నేతల చేతులలో కీలుబొమ్మలుగా మారి, వారి ఆదేశాలకు గంగిరెద్దులా తలాడించక తప్పదు. లేదంటే మునిసిపల్ మంత్రి, అవసరమైతే ముఖ్యమంత్రి దగ్గర తమ పలుకుబడి ఉపయోగించి బదిలీ చేయించేస్తారు.

### అడుగడుగునా అక్రమ కట్టడాలే...

నగరంలో గత నాలుగేళ్ళుగా అనూహ్యంగా అభివృద్ధి చెందుతున్న రాజీవ్ రహదారి(మినీబైపాస్)తో సహా ఎక్కడా సిటీలో 100 అడుగుల రోడ్డు కనపడదు. అంతా ఆక్రమణల మయమే. ఈ రోడ్డు ఏర్పడిన తొలినాళ్ళలో జరిగిన నిర్మాణాలకు సైతం అనుబంధ కట్టడాలు దర్శనమిస్తున్నాయి. రోడ్డు మార్జిన్‌లతో పాటు భవనానికి మిగిలిన వైపు వదిలిపెట్టిన సెట్‌బ్యాక్‌లలో కూడా ఇప్పుడు భవన యజమానులు తాత్కాలిక నిర్మాణాలు చేపట్టి లక్షలకు లక్షలు బాడుగలు వసూలు చేసుకుంటున్నారు. కొత్తగా నిర్మించే భవన యజమానుల వద్దనుండే కాకుండా పాత వాటికి ఆనుకుని నిర్మిస్తున్నవారి వద్ద కూడా టౌన్‌ప్లానింగ్ సిబ్బంది దొరికిన మేరకు దోచుకుని సైలెంట్ అయిపోతున్నారు. కొత్తవైనా పాతవైనా సంబంధిత ప్రాంత బడా నేత అనుమతితో వారి కనుసైగలలో జరగాల్సిందే. లేదంటే ఆ నిర్మాణం నూటికి నూరుశాతం పక్కాగా ఉన్నా పగలగొట్టేస్తారు. అలా పక్కాగా ఉన్న వాటిని కూడా పగలగొట్టడానికి సిటీ ప్లానింగ్ అధికారులు, సూపర్‌వైజర్ల సహకారం కావాలి కాబట్టి నేతలకు సహకరిస్తూ వారి పబ్బం వారు గడుపుకుంటున్నారు.

### అధ్వాన్నమైన ట్రాఫిక్ వ్యవస్థ

రోజురోజుకి నగర జనాభాతో పాటు విస్తీర్ణం కూడా పెరిగింది. కృష్ణపట్నం పోర్టుతో పాటు పోర్టుకి అనుబంధంగా అనేక విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలు, పరిశ్రమలు, పలు అంతర్జాతీయ సంస్థల కార్యాలయాలు నెల్లూరు నగర పరిసర ప్రాంతాలలో ఏర్పాడ్డాయి. ఈ సంస్థలలో పనిచేసే ఉద్యోగులు పలు రాష్ట్రాలనుండి నెల్లూరుకు తరలి రావడంతో నగరవాసుల జీవన విధానం కూడా క్రమేణా మారుతూ వస్తోంది. నగరమంతా అంతర్జాతీయ బ్రాండ్లకు చెందిన వ్యాపారసంస్థలు వెలుస్తున్నాయి. ముఖ్యంగా అన్ని రకాల ఆహార పదార్ధాలు అందించే పలు రెస్టారెంట్లు తెరుచుకుంటున్నాయి. పబ్ కల్చర్ కూడా పురుడుపోసుకుంది. ఇలాంటి సందర్భాలలో సైతం నగర పరిస్థితులు మారలేదు. రోడ్ల విస్తీర్ణం జరగడంలేదు. పార్కింగ్ వసతి కోసం ప్రత్యామ్నాయాలను వెతకడం లేదు. అస్తవ్యస్తంగా ఉంటున్న ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించే చర్యలు కనపడడంలేదు. మాటలు మాత్రం కోటలు దాటుతున్నాయి. టౌన్‌బస్సులపై అదుపు లేదు. ఆటోలకు నియంత్రణ లేదు. అంతా ఓట్ల రాజకీయమే. నేతల చేతల పుణ్యమా అంటూ సామాన్యుడు సైతం శక్తివంతంగా మారి అన్యాయాన్ని ప్రశ్నించేవారిపై తిరగబడే పరిస్థితి దాపురించింది.

### మార్పు కోసం ప్రయత్నించాలి...

రాజకీయ పెద్దలు, అధికారులు ఇప్పటికైనా సమన్వయంతో నగర అభివృద్ధికి పాటుపడాలి. అధికారులు వస్తారు, వెళ్తారు. కానీ నగరంలో శాశ్వతంగా ఉండిపోయేది నాయకులే. అధికారంలో ఉన్నా లేకున్నా వారి నివాసం మాత్రం నగరంలోనే. ఇప్పుడు కార్పొరేషన్లో ప్రతిపక్షం కూడా లేదు. అంతా స్వపక్షమే. ఇలాంటి తరుణంలోనైనా నగర సమస్యలపై దృష్టిపెట్టి దీర్ఘకాల సమస్యలకు శాశ్వత పరిష్కారాలు కనుగొంటే చరిత్రలో నిలిచిపోతారు, లేదంటే చరిత్ర హీనులుగా మిగిలిపోతారు.

## మురుగు గుంటల నిలయంగా మాగుంట లేఅవుట్



పిచ్చి చెట్లు, మురుగునీటితో నిండిపోయి రోడ్డు కూడా కనపడకుండా తయారైన మాగుంట లే అవుట్‌లోని కొన్ని ప్లాట్లు

నెల్లూరు బంజారాహిల్స్‌గా పేరుపొందిన ఆధునిక ప్రాంతం మాగుంట లే-అవుట్. గత దశాబ్ద కాలంలో ఈ ప్రాంతం బాగా అభివృద్ధి చెందింది. ఒకప్పుడు కేవలం స్థితిమంతుల నివాసాల కోసమే మాగుంట లే-అవుట్ అని ఉన్న అపోహ తొలగిపోయేలా ఇప్పుడు అన్ని వర్గాల ప్రజలకు నివాస యోగ్యంగా మారింది. ముఖ్యంగా లే-అవుట్‌లోని అధిక ప్రాంతం అపార్ట్‌మెంట్లకు నిలయంగా మారిపోయింది. ప్రఖ్యాత వ్యాపార సంస్థ డీ-మార్ట్ మాగుంట లే-అవుట్‌కి రావడంతో వ్యాపార కార్యకలాపాలకు కూడా ఈ ప్రాంతం ప్రాముఖ్యతను సంతరించుకుంది. ప్లాట్ల ధరలు కూడా ఒక్కసారిగా ఆకాశాన్ని తాకాయి. ఈ లే-అవుట్ చాలా పెద్దది కావడంతో ఇంకా ఖాళీ స్థలాలు కోకొల్లలుగా ఉన్నాయి. ఇక్కడే అసలు సమస్య ఏర్పడుతోంది. చుట్టుపక్కల నిర్మాణాలు ఏర్పడడంతో పక్కనే ఉన్న స్థలాలు మురుగు గుంటలుగా మారి దోమల ఉత్పత్తి కేంద్రాలుగా తయారయ్యాయి. కేవలం దోమలే కాదు, ప్రతి ఇంట్లో మనుషులతో పాటు పాములు కూడా కాపురం చేస్తున్నాయి. వాస్తవానికి ఖాళీస్థలాలను మట్టితో నింపి వాటిల్లో ఎలాంటి నీళ్ళు నిలబడకుండా చేయాల్సిన బాధ్యత కార్పొరేషన్ అధికారులదే!.. కానీ వాళ్ళకివేమీ పట్టవు. గతంలో ఉన్న మాగుంట లే-అవుట్ రెసిడెంట్స్ అసోసియేషన్ సభ్యులు ఖాళీస్థలాలపై దృష్టిపెట్టి చాలావరకూ మట్టి తోలించారు. మొండికేసిన వారికి కార్పొరేషన్ చేత నోటీసులు కూడా ఇప్పించి పూడ్పించారు. అయితే ఇప్పుడు పరిస్థితులు ఆలా లేవు. ఇప్పటి అధికారులకు కూడా నేతల అనుమతి లేనిదే నోటీసులిచ్చే ధైర్యం లేదు.

ఈ విషయంలో నేతలే చొరవ చూపాలి! ఇక్కడ అక్రమ కట్టడాలు కూడా అడ్డూ ఆపూ లేకుండా సాగుతున్నాయి. 10 నుండి 15 అంకణాల త్రికోణాల స్థలాలలో కూడా 2 లేదా 3 అంతస్తులకు అనుమతులు తీసుకుని పరిమితులను దాటి 4, 5, 6 ఫ్లోర్‌లు కూడా కట్టేస్తున్నారు. మరి మన కార్పొరేషన్ అధికారుల కళ్ళకు ఇవేమి కనపడడం లేదు. ఎందుకంటే సదరు భవన యజమానులకు నేతల ఆశీస్సులు దండిగా ఉండడమే.

### నడ్డి విరిగే వడ్డీలతో పన్నుల వసూళ్ళు...

నెల్లూరు కార్పొరేషన్‌కు రావలసిన పన్నుల బకాయి వసూళ్ళలో మాత్రం అధికారులు తమ ప్రతాపం అంతా చూపిస్తున్నారు. గడువులోగా చెల్లించకపోతే 24 శాతం(నూటికి 2 రూపాయలు) వడ్డీ పెనాల్టీగా చెవులు పిండి వసూలు చేస్తున్నారు. మొండి బకాయిలు ఉంటే దుకాణానికి సీలు వేస్తామని బెదిరించి మరీ డబ్బులు గుంజుతున్నారు.

### కార్పొరేషన్ చెల్లించాల్సిన బకాయిల సంగతో...?

మరి కార్పొరేషన్ చెల్లించాల్సిన బకాయిలకు కూడా ఇదే రూలు వర్తిస్తుందా...? వాళ్ళు కూడా 2 రూపాయిల వడ్డీతో చెల్లిస్తారా...?? అమ్మా... ఆశ, దోశ, అప్పడమేమీ కాదా..! అంత సీన్ లేదు. వాళ్ళు ఇచ్చేది మాత్రం ఇచ్చినప్పుడు తీసుకోవలసిందే, ఇచ్చినంత తీసుకోవాలసిందే. ఒకవేళ ఎవరైనా కాంట్రాక్టర్ ఎదురు ప్రశ్నిస్తే వెంటనే సదరు కాంట్రాక్టర్‌ని బ్లాక్‌లిస్ట్ చేసేస్తారు. కార్పొరేషన్ పనులు చేసిన కాంట్రాక్టర్లు డబ్బులు రాక లబోదిబోమంటున్నారు. కార్పొరేషన్ నుండి తమ శాఖకు బకాయిలను వసూలు చేసుకోలేక పలు ప్రభుత్వ రంగ సంస్థలు కూడా తల పట్టుకుంటున్నాయి. మనకి రావలసి ఉంటే ఒక న్యాయం... మనం ఇవ్వవలసి ఉంటే మరో న్యాయం! ఎంతవరకు సబబో కార్పొరేషన్ పెద్దలే ఆలోచించుకోవాలి.

## కాలధర్మం

## బయ్యా సరోజనమ్మ



నెల్లూరులో ప్రసిద్ధిచెందిన 'న్యూ రాజ్యలక్ష్మి హాల్', 'శుభమస్తు' షాపింగ్‌మాల్' అధినేత స్వర్గీయ బయ్యా వెంకరమణయ్య సతీమణి సరోజనమ్మ మార్చి 9 బుధవారం మధ్యాహ్నం 1 గంట ప్రాంతంలో కాలధర్మం చెందారు. ఆమె వయసు 74 సంవత్సరాలు. ఆమెకు ఇద్దరు కుమారులు.. బయ్యా శ్రీనివాసులు, రవికుమార్. మాతృమూర్తి మరణంతో వారు తీరని ఆవేదనకు గురయ్యారు.

నెల్లూరులో ఇప్పుడు 'శుభమస్తు' షాపింగ్‌మాల్ అంటే తెలియని వారుండరు. దీనికిముందు 50 ఏళ్ల క్రితం నగరంలోని చిన్నబజార్‌లో 'న్యూ రాజ్యలక్ష్మి హాల్' వస్త్ర నిలయం ఉండేది. ఇది కూడా జిల్లావాసులందరికీ సుపరిచితమే. వీటిని స్థాపించింది స్వర్గీయ బయ్యా వెంకటరమణయ్య. వీరి స్వస్థలం ఉదయగిరి నియోజకవర్గంలోని దుత్తలూరు. వ్యాపారరీత్యా చాలా ఏళ్ళ క్రితమే వీరి కుటుంబం నెల్లూరుకు వచ్చింది. ఆయన నెలకొల్పిన రెండు వస్త్ర నిలయాలు నెల్లూరు వస్త్రప్రపంచంలో కొత్తదనాన్ని సంతరించుకుని ఎంతో పేరు గడించాయి. ఆ తర్వాతకాలంలో నెల్లూరుతో పాటు తిరుపతి, విజయవాడ, రాజమండ్రిల్లో కూడా వస్త్రవ్యాపారాన్ని విస్తరించారు. వెంకటరమణయ్య దివంగతులైన అనంతరం వారి కుమారులు తండ్రి బాటలో నడుస్తూ వ్యాపారాన్ని వృద్ధిలోకి తెచ్చారు. పెద్ద కుమారుడు బయ్యా శ్రీనివాసులుకు తొలినుంచి ఆర్‌ఎస్ఎస్ అంటే ఎంతో అభిమానం. ఇప్పుడు స్టేట్ పిఆర్‌ఓగా ఆర్‌ఎస్ఎస్‌లో క్రియాశీలకపాత్ర పోషిస్తున్నారు కూడా. చిన్నకుమారుడు బయ్యా రవికుమార్ లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్‌గా సేవలందిస్తున్నారు. తమ తండ్రి గుండెపోటుతో ఆకస్మికంగా మరణించడంతో తాము పడిన వేదనను దృష్టిలో పెట్టుకుని ఆ బాధ మరెవరూ పడకూడదనే ఉద్దేశంతో 'శుభమస్తు ఫౌండేషన్'ను ఏర్పాటుచేసి గుండెజబ్బులున్న వారికి తమవంతు సేవగా తమ షాపింగ్‌మాల్స్‌లో ఉచితంగా మందులు పంపిణీ చేస్తున్నారు. మంచి సేవాభావం కలవారిగా తన బిడ్డలను తీర్చిదిద్దిన మాతృమూర్తి సరోజనమ్మ మృతికి సంతాపం తెలియజేస్తూ, అమ్మను కోల్పోయి శోకసాగరంలో ఉన్న బయ్యా సోదరులకు ప్రగాఢ సానుభూతిని తెలుపుతోంది 'లాయర్'!..

### ఉపరాష్ట్రపతి వెంకయ్య సంతాపం :

శుభమస్తు షాపింగ్‌మాల్ అధినేతలు..బయ్యా సోదరుల మాతృమూర్తి సరోజనమ్మ మరణానికి చింతిస్తూ వారి కుమారులు బయ్యా శ్రీనివాసులు, రవికుమార్‌లకు భారత ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు ఒక ప్రకటనలో తమ సంతాపం తెలియజేశారు. వారి కుటుంబానికి ప్రగాఢ సంతాపం ప్రకటిస్తూ, సరోజనమ్మకు ఆ భగవంతుడు సద్గతి ప్రాప్తించాలని కోరుకుంటున్నానని ఆయన పేర్కొన్నారు.

# సమాజానికి దిక్సూచీలు సాహితీవేత్తలు

## విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు



## మల్లెతీగ, చిన్ని నారాయణరావు ఫౌండేషన్ కథల పోటీల విజేతలకు బహుమతి ప్రదానం

సమాజానికి సాహితీవేత్తలు దిక్సూచిలాంటి వారని, స్వాతంత్ర్యోద్యమంలో తమ సాహిత్యం ద్వారా ప్రజలను చైతన్యపరిచి ముందుకు నడిపించారని విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. మల్లెతీగ సాహిత్య పత్రిక, నెల్లూరుకు చెందిన ప్రముఖ కవి ఏర్పాటుచేసిన 'చిన్ని నారాయణరావు ఫౌండేషన్' సంయుక్తంగా ఇటీవల నిర్వహించిన కథల పోటీల విజేతలకు బహుమతి ప్రదానోత్సవ సభ ఈనెల 6న విజయవాడలోని ఠాగూర్ స్మారక గ్రంథాలయంలో ఆహ్లాదకర వాతావరణంలో జరిగింది. సుప్రసిద్ధ రచయిత శ్రీరామకవచం సాగర్ అధ్యక్షత వహించారు.

ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే విష్ణు మాట్లాడుతూ సెల్‌ఫోన్లు వచ్చాక క్రమేణా పుస్తక పఠనం తగ్గిపోయిందన్నారు. ఈ పరిస్థితుల్లో చిన్ని నారాయణరావు లాంటి సాహితీవేత్తలు ఫౌండేషన్ల ద్వారా కథల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ఇచ్చి ప్రోత్సహించడం అభినందనీయమన్నారు. కవులు, రచయితలను గౌరవించే క్రమంలో ప్రభుత్వపరంగా సహాయ సహకారాలు అందించడంలో ఎల్లవేళలా అందు బాటులో ఉంటామన్నారు. సాహిత్యానికి పూర్వవైభవం తీసుకురావడానికి నడుంకట్టిన సాహితీవేత్తలందరికీ ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్ర మైనార్టీల సంక్షేమ శాఖ ప్రత్యేక కార్యదర్శి ఎం.డి ఇంతియాజ్ మాట్లాడుతూ రచయితలను ప్రోత్సహించేవిధంగా చిన్ని నారాయణరావు ఫౌండేషన్, మల్లెతీగ సంయుక్తంగా ప్రత్యేకంగా కథల పోటీలు పెట్టడం అభినందనీయమన్నారు. సమాజానికి ఒక మంచి సందేశం ఇవ్వడానికి కవులు, రచయి తలు తమ వంతు కృషిచేస్తున్నారని కొనియాడారు. రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ ఛైర్మన్ మందపాటి శేషగిరిరావు మాట్లాడుతూ సాహిత్యంపైన గాని, సాహిత్యానికి సంబంధించిన ఒరవడిపైగాని తనకంత ప్రజ్ఞ లేనప్పటికీ ఒక ఉత్తేజపూరితమైన, ఉద్వేగభరితమైన ఆలోచనలైతే మాత్రంలో మనసులోకి వస్తున్నాయని, అందుకేనేమో ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి ఆలోచించి తనను కూడా మీ సాహితీ పరిమళాలకు దగ్గరగా ఉండేటట్టుగా విజ్ఞానాన్ని ప్రపంచానికి అందించే గ్రంథాలయానికి ఛైర్మన్ హోదాలో తనను నియ మించినట్టుగా భావిస్తున్నానని చెప్పారు. తాను ఛైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన వెంటనే రాష్ట్రవ్యాప్తంగా గ్రంథాలయాలకు పుస్తకాలు కొనుగోలు చేసేందుకు నిర్ణయం తీసు కున్నామన్నారు. రాబోయే కాలంలో మీ ఆలోచనలను, మీ ఉద్దేశాలను పరిగణనలోకి తీసుకుని గ్రంథాలయాలను సమాజానికి ఇంకా దగ్గరగా తీసుకువెళ్లేందుకు ప్రయత్నం చేస్తానన్నారు. అభ్యుదయ రచయితల సంఘం జాతీయ కార్యదర్శి పెనుగొండ లక్ష్మీ నారాయణ కథారచనలపై ప్రముఖ రచయితలను ఉదహరిస్తూ సోదాహరణంగా మాట్లాడారు. కథాసాహిత్యం అభ్యుదయపథాన్ని వీడడం జరగదని అభిప్రాయపడ్డారు. ఇటీవలి కాలంలో సాహిత్యానికి విలువ తగ్గిందా.. అవకాశం తగ్గిందా... అనే పరిస్థి తుల్లో మల్లెతీగ, చిన్ని నారాయణరావు ఫౌండేషన్ సంయుక్తంగా కథల పోటీలు నిర్వహించడం తద్వారా రచయితలను ప్రోత్సహించడం అభినందనీయమన్నారు. కృష్ణా జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్‌పర్సన్ టి.జమలాపూర్ణమ్మ, చిన్ని నారాయణరావు ఫౌండేషన్ ఛైర్మన్ చిన్ని నారాయణరావు, జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి నాగరాజు, పలువురు కవులు, రచయితలు పాల్గొన్నారు. తొలుత మల్లెతీగ సాహిత్య సేవాసంస్థ అధ్యక్షులు కలిమిశ్రీ అతిథులకు ఆహ్వానం పలకగా.. చొప్పా రాఘవేంద్రశేఖరావు కార్యక్రమ నిర్వహణను చేపట్టారు.

### కథల పోటీల విజేతలు :

మొదటి బహుమతి వాసంతి (సికింద్రాబాద్), రెండవ బహుమతి సృజన్ సేన్ (హైదరాబాద్), మూడవ బహుమతి వడలి రాధాకృష్ణ (చీరాల), ప్రత్యేక బహుమతులు బాలి (విశాఖపట్నం), జిల్లెళ్ల బాలాజీ (తిరుపతి), తటవర్తి నాగేశ్వరి (కొవ్వూరు)లకు అతిథులు అందజేశారు. ప్రత్యేక బహుమతులు విహారి (హైదరాబాద్), సింహప్రసాద్ (హైదరాబాద్), శరత్ చంద్ర (హైదరాబాద్), బళ్ళా షణ్ముఖరావు (విశాఖపట్నం), వియోగి (కర్నూలు), టి.తిప్పారెడ్డి (మదనపల్లి), జ్యూరీ బహుమతి శైలజామిత్ర (హైదరాబాద్)లకు త్వరలో అందజేస్తారు.

### ఉగాది ప్రత్యేక పురస్కార గ్రహీతలు :

చిన్ని నారాయణరావు ఫౌండేషన్ ఉగాది ప్రత్యేక పురస్కారాలను 'కవిసంధ్య' సంపాదకులు డాక్టర్ శిఖామణి, ప్రముఖ రచయితలు శ్రీరామకవచం సాగర్, ఏటూరి నాగేంద్రరావు, నవమల్లెతీగ సంపాదకులు కలిమిశ్రీలకు అతిథులు అందజేశారు. ఉత్సాహభరిత వాతావరణంలో జరిగిన ఈ కార్యక్రమానికి చిన్ని నారాయణరావు ఫౌండేషన్ సౌజన్యం అందించింది. అనంతరం నిర్వాహకులు అతిథులకు సత్కారం చేశారు.

# ఏపి మైనార్టీల కార్పొరేషన్ డైరెక్టర్‌గా మున్వర్

ఆంధ్రప్రదేశ్ స్టేట్ మైనార్టీస్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా నెల్లూరు నగరానికి చెందిన ఎస్‌డి మున్వర్‌ను ఇటీవల ప్రభుత్వం నియమించింది. తనకు ఈ పదవి వచ్చేందుకు మంత్రి డా.అనిల్ ఎంతో కృషిచేశారంటూ ఆయన మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.

# గిరిజనులకు ప్రత్యేక ఆధార్ కేంద్రాలు

జిల్లాలోని గిరిజనుల కష్టాలను తొల గించేందుకు వారికి ప్రత్యేకంగా ఆధార్ నమోదు కేంద్రాలను, మొబైల్ కిట్లను ఏర్పాటు చేశామని జిల్లా కలెక్టర్ కె.వి. చక్రధర్‌బాబు తెలిపారు. ఈనెల 7న ఆయన నగరంలోని కలెక్టరేట్‌లో స్పందన కార్యక్రమం సందర్భంగా తోటపల్లి గూడూరు మండలం మాచర్లవారిపాళెం గ్రామానికి చెందిన నలుగురు యానా దులకు ఆధార్ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లా డుతూ జిల్లాలో గిరిజనులు ముఖ్యంగా యానాదులకు ఆధార్ కార్డులు లేక చాలా ఇబ్బందులకు గురవుతున్నారని, అందువల్ల ఆధార్ లేని గిరిజనులను, యానాదులను గుర్తించి ప్రత్యేకంగా సంచార ఆధార్ కిట్లను, శాశ్వత ఆధార్ కేంద్రాన్ని ఏర్పాటు చేయించి గిరిజన సంక్షేమ శాఖ, సమగ్ర శిక్ష అధికారుల సహకారంతో ఆధార్ నమోదు చేయించి వారికి ఆధార్ కార్డులు ఇవ్వడం జరుగుతుందన్నారు. ఇప్పటి వరకు శాశ్వత ఆధార్ కేంద్రం, 5 మొబైల్ ఆధార్ కిట్ల ద్వారా 5299 మందికి ఆధార్ నమోదు చేయించి కార్డులు పంపిణీ చేశామన్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ సంయుక్త కలెక్టర్ హరేందిరప్రసాద్, ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి కనకదుర్గ భవాని, డిటిడబ్ల్యూఓ పరిమళ, ఏటి డబ్ల్యూఓ రమణయ్య పాల్గొన్నారు.

# పురుషులకు ధీటుగా మహిళలు

**- డా. కె.లలిత షిర్డీశ**



ప్రపంచంలో మహిళలు అన్ని రం గాల్లో ముందుంటున్నారని, రోదసిలోకి కూడా వెళుతున్నారని, శాసనాలు చేయ డంతోపాటు, దేశాలను పరిపాలిస్తున్నారని, శాస్త్రవేత్తలుగా, క్రీడాకారులుగా, రక్షణ శాఖలో కూడా తమ ప్రతిభను చాటుతు న్నారని ప్రముఖ గైనకాలజిస్ట్ డా. కె.లలిత షిర్డీశ అన్నారు. ఈనెల 7న వెంకటేశ్వర పురంలో శ్రీ సాయి ధ్యాన యోగ మందిరం సౌజన్యంతో రూడ్స్ చారిటబుల్ ట్రస్ట్, పీఎంపీ అసోసియేషన్ సంయుక్త ఆధ్వ ర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ చిన్నతనం నుంచి మహిళ లలో తాము తక్కువ అనే భావనతో పెరగ కుండా, అన్నిట్లో సమానమనే అవగాహన పెంచేందుకు తల్లిదండ్రులు, ఉపాధ్యా యులు కృషిచేయాలన్నారు. అనంతరం డా. కె.లలిత షిర్డీశ, సిస్టర్ రమ, ఓ.జయ, డి.విజయలక్ష్మి, పి.రమాదేవి, యస్. పెంచలలక్ష్మి, జె.రమాదేవి, సిహెచ్. వెంకటరమణి, ఎన్.రమాదేవి, యు.భారతి లను సన్మానించి మెమెంటోలు అందజే శారు. జిల్లా పీఎంపీ గౌరవాధ్యక్షులు అనుముల జయప్రకాష్, రూడ్స్ చైర్మన్ షేక్ రసూల్, గీత ప్రబోధిక్ షేక్ నజీర్ భాష గురుజీ, పీఎంపీ అధ్యక్షులు శాఖవరపు వేణుగోపాల్, నరసాపురం ప్రసాద్, ఓ. మస్తానయ్య, షేక్ జిలానీబాషా, కె.శ్రీని వాసులురెడ్డి, సనావుల్లా, రవి, జి.శేషయ్య, సి.వీరయ్య, డి.శ్రీనివాసులు, ఎ.రాజశేఖర్, షేక్ ఇర్ఫాన్ తదితరులు పాల్గొన్నారు.



# మైపాడు బీచ్ వద్ద.. పోలీస్ ఔట్‌పోస్ట్

జిల్లాలోని ప్రముఖ పర్యాటక కేంద్రం, ఇందుకూరుపేట మండలంలోని మైపాడు బీచ్ వద్ద పోలీస్ ఔట్‌పోస్టును ఏర్పాటుచేశారు. దాదాపు 7 లక్షల రూపాయల సిఎస్ఆర్ నిధులతో నిర్మించిన ఈ పోలీసు కేంద్రానికి జడ్పీ ఛైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డితో కలసి జిల్లా ఎస్పీ సిహెచ్ విజయారావు ఈనెల 7న ప్రారంభోత్సవం చేశారు. ముఖ్యంగా ఆదివారం రోజుల్లోను, సెలవుదినాల్లోనూ ఈ బీచ్‌కి పెద్దసంఖ్యలో పర్యాటకులు వస్తుంటారు. శాంతిభద్రతల పరిరక్షణ కోసం ఇక్కడ పోలీసు సిబ్బందిని ఏర్పాటుచేస్తున్నామని, సిసి కెమెరాల నిఘా కూడా పెడుతున్నా మని జిల్లా ఎస్పీ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ వెంకటరమణమ్మ, డిఎస్పీ హరనాథ్‌రెడ్డి, వైకాపా నాయకులు ఆనం విజయకుమార్‌రెడ్డి, దువ్వూరు కల్యాణ్ కుమార్‌రెడ్డి, జడ్పీ వైస్ ఛైర్మన్ జయలక్ష్మి, సిఐలు జగన్‌మోహన్‌రావు, కృష్ణారెడ్డి, ఎస్ఐలు ఆనంద్, ఇంద్రసేనారెడ్డి, సుబ్బారావు, శివనాంచారయ్య తదితరులు పాల్గొన్నారు.

### మంచినీటి పథకానికి శంకుస్థాపన



మైపాడులో సుమారు 40లక్షలతో నిర్మించనున్న మంచినీటి రక్షిత పథకానికి ఈనెల 7న జడ్పీ ఛైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్న కుమార్‌రెడ్డితో కలసి శంకు స్థాపన చేశారు. ఈ పథకానికి జలజీవన్ మిషన్ నుంచి మరో 50 లక్షలు కూడా మంజూరైనట్లు ప్రసన్న చెప్పారు. వైకాపా నాయకుడు దువ్వూరు కల్యాణ్‌రెడ్డి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. డిసిసిబి మాజీ ఛైర్మన్ ఆనం విజయకుమార్‌రెడ్డి, సిఐఓ శ్రీనివాసరావు, ఎస్‌డిపిఓ హరనాథ్, ఆప్కాప్ ఛైర్మన్ కొండూరు అనిల్‌బాబు, విజయ డెయిరీ ఛైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, డిసిఎంఎస్ ఛైర్మన్ మావులూరు శ్రీనివాసులురెడ్డి, డిఎల్‌డిఏ ఛైర్మన్ గొల్లపల్లి విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు

విడలూరులోని డిఎల్ఎన్ఆర్ ప్రభుత్వ ఉన్నతపాఠశాలలో చదువుకుంటూ ప్రతిభతో రాణిస్తున్న పలువురు విద్యార్థులకు ఇటీవల ప్రతిభా పురస్కారాలు ప్రదానం చేశారు. పదిమంది విద్యార్థులకు అయిదువేల రూపాయల వంతున నగదు ప్రోత్సాహకాలు అందజేశారు. ఈ కార్యక్రమానికి బుచ్చి నగర పంచాయతీ ఛైర్‌పర్సన్ మోర్ల సుప్రజ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ ఈ పాఠశాలలో ఆరు నుంచి పదవతరగతి వరకు ప్రతి తరగతిలో ఉత్తమ ప్రతిభ కనపరచిన ఇద్దరు విద్యార్థులకు పాళెం మంగమ్మ ట్రస్ట్ ద్వారా ప్రతిఏటా నగదు బహుమతులు అందజేస్తున్నారన్నారు. అనంతరం విద్యార్థులందరికీ వైద్యశాఖ ఆధ్వర్యంలో నులిపురుగుల నివారణ మందును పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఇఓ దిలీప్, హెడ్మాస్టర్ నాగపద్మ, వైస్ ఛైర్‌పర్సన్లు లలితమ్మ, షాహుల్‌తో పాటు కౌన్సిలర్లు నాగరాజు, ప్రత్యూష తదితరులు పాల్గొన్నారు.

# అన్ని రంగాల్లోనూ మహిళల పాత్ర కీలకం



సత్కారాన్నందుకుంటున్న తోట సులోచన, స్వాతి


అంతర్జాతీయ మహిళా దినో త్సవం సందర్భంగా మార్చి 8న నెల్లూరు ప్రెస్‌క్లబ్‌లో సామ్నా ఆధ్వర్యంలో మహిళా దినోత్సవ కార్యక్రమం ఘనంగా జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఏపియు డబ్ల్యుజె రాష్ట్ర కార్యదర్శి జయ ప్రకాష్ మాట్లాడుతూ తొలి నుంచి కూడా గ్రామాల్లో మహిళలు వ్యవసాయం, కుటీర పరిశ్రమల్లో అధికభాగం పాలు పంచుకుంటున్నారని, అందువల్లనే దేశాభివృద్ధి జరిగిందన్నారు. కాలనుగుణంగా మహిళలు అన్ని రంగాల్లోనూ కీలకపాత్ర పోషిస్తున్నారని, పారిశ్రామిక అభివృద్ధి, కార్పొరేట్ రంగం, రక్షణ రంగం, విద్యా వైద్య రంగాల్లో మహిళలు ముందుకు దూసుకుని వెళ్లడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా ప్రముఖ రచయిత్రి తోట సులోచన, యువ రచయిత్రి డాక్టర్ నీలం స్వాతిలను సన్మానించారు. సామ్నా అధ్యక్ష, కార్యదర్శులు సర్వేపల్లి రామమూర్తి, గడ్డం హనోక్‌లతో పాటు పి.విజయకుమార్, టి.గోపీనాథ్, సింగరాజు రామారావు, వేలూరు సుబ్బారావు, ఆవుల వెంకటేశ్వర్లు, అక్బర్, నీలం నర్సయ్య, జి.విక్రమ్, ప్రవీణ, హజరత్తయ్య, వి.భాస్కరరావు, కరుణాకర్, పి.జావేద్ తదితరులు పాల్గొన్నారు.

## యాదాద్రిలో నిత్యాన్నదానానికి

# కోటీ 8 లక్షల విరాళం

**సాహితీప్రియులు, ఆధ్యాత్మికవేత్తలు, వదాన్యులు, మన నెల్లూరీయులు**

**'పద్మభూషణ్' డాక్టర్ వరప్రసాద్‌రెడ్డి ఔదార్యం**



**అన్నిదానాల్లో అన్నదానం గొప్పదని అంటారు. అందులోనూ 'అన్నం పరబ్రహ్మ స్వరూపం'. పదిమందికీ అన్నం పెడితే అంతకన్నా పుణ్యం ఉండదని శాస్త్రాలు చెప్తున్నాయి. అందుకే అటు మాధవ సేవతో పాటు, మానవసేవ కూడా ముఖ్య మని భావించే మన నెల్లూరీయులైన ప్రముఖ దాత.. 'పద్మభూషణ్' డాక్టర్ కెఐ వరప్రసాద్‌రెడ్డి యాదాద్రి శ్రీ లక్ష్మీనర సింహస్వామి క్షేత్రంలో నిర్వహిస్తున్న భక్తుల నిరతాన్నదానానికి ఆయన వ్యక్తిగత నిధుల నుండి కోటీ ఎనిమిది లక్షల రూపాయల విరాళాన్ని అందించి తన ఔదార్యాన్ని.. మానవతా హృదయాన్ని చాటుకున్నారు.**

ప్రముఖ పుణ్యక్షేత్రమైన తెలంగాణ లోని భువనగిరి జిల్లాలో కొలువైవున్న యాదాద్రిలో వైభవోపేతంగా జరుగుతున్న శ్రీ లక్ష్మీనరసింహస్వామి వార్షిక బ్రహ్మోత్స వాల సందర్భంగా వరప్రసాద్‌రెడ్డి దంప తులు యాదాద్రిని సందర్శించి స్వామి వారికి కోటీ 8 లక్షల రూపాయల భూరి విరాళాన్ని సమర్పించుకున్నారు. అయిదవ రోజు జరిగే బ్రహ్మోత్సవాల్లో నారసిం హుడు మురళీకృష్ణుడి అలంకారంలో కొలువుదీరారు. వివిధ రకాల పుష్పా లతో.. వజ్రవైడూర్యాలతో ఆలయ అర్చ కులు స్వామివారిని కన్నులపండువగా అలంకరించారు. స్వామివారు సుప్రశాంత వదనంతో నయనమనోహరంగా భక్తులకు దర్శనమిస్తున్న వేళ..ఆయన స్వామివారి ముగ్ధమోహన రూపాన్ని దర్శించుకుని తరించారు. వేదమంత్రాలు, వేదపారాయ ణాలు, మంగళవాయిద్యాల నడుమ అంగ రంగ వైభవంగా బాలాలయంలో స్వామి వారికి జరిగిన ఊరేగింపులో వరప్రసాద్ రెడ్డి దంపతులు ఎంతో భక్తిశ్రద్ధలతో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారికి ఆలయ అర్చకులు శ్రీ మురళీకృష్ణుడి అలం కార విశిష్టత గురించి తెలియజేశారు.

### యాదాద్రీశుని దర్శనం.. ఆనందకరం

మార్చి 8న మంగళప్రదమైన మంగళ వారం నాడు వరప్రసాద్‌రెడ్డి దంపతులు యాదాద్రీశుని దర్శించుకున్నారు. స్వామి వారి నిత్యాన్నదాన కార్యక్రమానికి కోటి ఎనిమిది లక్షల రూపాయల చెక్కును ఆలయ కార్యనిర్వహణాధికారిణి గీతకు అందజేశారు. ఈ సందర్భంగా వరప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ స్వామివారిని దర్శించు కోవడం తమకెంతో సంతోషంగా ఉంద న్నారు. 'కొన్ని క్షేత్రాలను దర్శిస్తే మంచిదని పురాణాలు, ఇతిహాసాలు చెబుతున్నాయి. అంతటి ప్రాధాన్యత ఉన్న దివ్యక్షేత్రం యాదాద్రి నరసింహస్వామి దేవాలయం. ఇక్కడ స్వామివారు స్వయంభువు అని పురాణాల్లో ఉంది. ఆ విశ్వాసంతోనే ఎలాంటి ఏర్పాట్లు లేనప్పుడే అధిక సం ఖ్యలో భక్తులు ఇక్కడికి వచ్చి స్వామివారిని దర్శించుకుని పుణ్యఫలాలు పొందేవారు. అప్పటితో పోలిస్తే ఇప్పుడు ఎన్నో రెట్లు ఎక్కువగా భక్తులు స్వామివారి క్షేత్రానికి తరలివస్తున్నారు. దానిని దృష్టిలో ఉంచు కుని అనేక సౌకర్యాలు ప్రభుత్వం చేపడు తోంది. ఎక్కువ సంఖ్యలో అతిథిగృహాలను నిర్మించింది. ఆ గెస్ట్‌హౌస్‌లలో పేదవారు ఉండకపోవచ్చు కానీ అలాంటి వారికి సమ యానికి అన్నం పెట్టే అవకాశం దేవస్థానం కల్పిస్తోంది. అందుకు తమ వంతుగా ఏదైనా చేద్దామనే ఆలోచనతోనే స్వామి వారికి ఈ విరాళం సమర్పించుకోవడం జరిగింది'..అని వరప్రసాద్‌రెడ్డి వినమ్రంగా తెలియజేశారు.

## అప్పు తీరిస్తే... చుక్కలు చూపిస్తున్న

# హెచ్‌డిఎఫ్‌సీ లిమిటెడ్ నెల్లూరు శాఖ

*'అప్పు తీరిస్తే చుక్కలు చూపించడమేంటి' హెడ్డింగ్ పొరపాటేమో... అని అనుకుంటున్నారా..? కాదు హెడ్డింగ్ కరక్టే. సహజంగా ఎవరైనా తీసుకున్న బాకీ తీర్చకపోతే నానాయాగీ చేస్తారు. అప్పు తీసుకున్నవారిపై వత్తిడి తెచ్చి ఇబ్బందులకు గురి చేస్తుంటారు. కానీ ఇక్కడ అలా కాదు. మీకు ఎంత అప్పు కావాలన్నా రండి, మీ అర్హతలను బట్టి ఇస్తాం. అయితే కాలపరిమితి కంటే ముందే చెల్లిస్తే మాత్రం ఒప్పుకోం అంటున్నాడో ఘనుడు.*

ఇక అసలు కథలోకి వెళ్దామా....

హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకుకు సంబంధించి హౌసింగ్ లోన్ కోసం హెచ్‌డిఎఫ్‌సి లిమిటెడ్ పేరుతో ప్రత్యేక విభాగం ఉంది. ఇల్లు కట్టుకోవాలనుకున్న వారిని, కొత్త అపార్ట్‌మెంట్ కొనుక్కోవాలనుకున్న వారిని ఈ బ్యాంకు ఏజెంట్లు వలేసి వెతికి పట్టుకుని తమ బ్యాంకు లోన్ తీసుకోమని బ్రతిమిలాడుతారు. లోన్ ప్రాసెస్ జరిగి ఖాతాదారుని చేతికి చెక్కు వచ్చేవరకు మన చుట్టూ వందసార్లయినా తిరిగి ఫార్మాలిటీస్ పూర్తి చేసుకుంటారు. లోన్ మంజూరు అయ్యే సమయంలో మనం బ్యాంకుకి వెళ్తే రాజమర్యాదలతో చూస్తారు. ఇక్కడివరకూ బాగానే ఉంది... పదేళ్లకో, పదిహేనేళ్లకో మనం లోన్ తీసుకుంటాం కాబట్టి ఇక మళ్ళీ వాళ్ళు మనసాయి తిరిగి కూడా చూడరు. మన గడువు పూర్తయ్యేలోగా చాలామంది మధ్యవర్తులు(బ్యాంకు రెప్రెజెంటేటివ్‌లు) మేనేజర్‌లూ మారిపోయి ఉంటారు. ఒకవేళ ఏదైనా కారణం చేత మన లోన్ ప్రీక్లోజ్ (ముందుగా చెల్లించడం) చేస్తే అలా అప్పు కట్టేసినందుకు మనకు ఫైన్ కూడా వేస్తారు. ఇదంతా ప్రతి బ్యాంకులోనూ సర్వ సాధారణమే. కానీ... నెల్లూరు హెచ్‌డిఎఫ్‌సి లిమిటెడ్ బ్యాంకు మేనేజర్ మాత్రం లోన్ ముందుగా చెల్లించాలని వెళ్ళే వారికి చుక్కలు చూపిస్తున్నాడట. ఋణం తీసుకున్న వారు డబ్బు కట్టేస్తాం అని బ్యాంకుకు వెళ్తే వాళ్ళ పట్ల కనీస మర్యాద కూడా లేకుండా ప్రవర్తిస్తున్నాడని అంటున్నారు. ఇటీవల ఒక ప్రభుత్వ ఉద్యోగిని ఫిబ్రవరి 14వ తేదీ తాను తీసుకున్న లోను మొత్తం అణా పైసలుతో చెల్లించేసింది. ఆమె ఇంటికి సంబంధించిన పత్రాలు తిరిగి ఇవ్వమంటే ఆమెను ఆమె భర్తను తన బ్యాంకు చుట్టూ తిప్పుకోవడమే కాకుండా వారి పట్ల వ్యంగ్యంగా, దురుసుగా కూడా ప్రవర్తించాడంట ఈ ఘనుడు. లోన్ చెల్లింపు సమయంలోనే వీరికి ఒక లేఖ ఇస్తూ అందులో వారి పత్రాలు ఇవ్వడానికి 20రోజులు గడువు పడుతుందని పొందుపరిచాడు. తమకేదో వేరే అవసరం ఉందని, వీలయినంత త్వరగా తెప్పించండని సదరు మేనేజర్‌ని ఆ దంపతులు కోరితే సరే.. ప్రయత్నిస్తానని చెప్పి పది రోజులపాటు వారిని బ్యాంకు చుట్టూ ప్రదక్షిణ చేయించాడట. డాక్యుమెంట్లు విజయవాడలో ఉన్నాయని ఇవ్వాళ వస్తాయి, రేపు వస్తాయి అని చెప్తూ వచ్చాడంట. చివరికి ఆ దంపతులు ఫిబ్రవరి 28న(పద్నాలుగు రోజుల తరువాత) 'అయ్యా... మేము విజయవాడకు వెళ్ళైనా తెచ్చుకుంటాం', అవి మాకు చాలా అవసరం అని ప్రాధేయపడితే, 'అవి విజయవాడలో ఎక్కడున్నాయి... ముంబై నుండి రావాలి' అంటూ మాట మార్చేశాడు. ఈ విషయంపై 'లాయర్' ఆరాతీయగా 'అవును చెప్పాను, వారికి గడువు ప్రకారం మార్చి 4వ తేదీ ఇవ్వాలి.. అప్పుడే ఇస్తా' అంటూ దురుసుగా సమాధానం చెప్పాడట ఆ పెద్దమనిషి. వారు చెల్లించిన మొత్తం నెల్లూరునుండి విజయవాడ వెళ్లాలని, అక్కడనుండి ముంబైకి చేరాలని.. ఈ తంతంతా జరగడానికి 20 రోజులు ఖచ్చితంగా పడుతుందని సమాధానమిచ్చాడు. ఇలా డబ్బుకడితే అలా తీసివ్వడానికి అవి తన టేబుల్ సొరుగులో ఉన్నాయా..? అంటూ తిరిగి ప్రశ్నించాడు. ఈయన గారు అన్ని రూల్స్ మాట్లాడుతున్నాడు.. ఈయనతో మనకెందుకు మన గడువు ప్రకారమే వద్దాం అంటూ ఆ దంపతులు మార్చి 5వ తేదీ ఉదయం బ్యాంకుకి వెళ్లారట... 'మీ పత్రాలు నెల్లూరుకు చేరాయి, కొరియర్‌లో ఉన్నాయి 3 గంటలకు రండి' అని చెప్పాడట. తీరా ఆ దంపతులు 3 గంటలకు వెళ్ళేసరికి అది శనివారం కావడంతో రెండుగంటలకే బ్యాంకు మూసేసి వెళ్లిపోయారట. అయ్యో ఇన్నిసార్లు తిరిగారే కస్టమర్‌కి పత్రాలు ఇచ్చి ఇంటికి వెళ్దామనే పాపభీతి కూడా ఆ కఠినాత్ముడికి లేదేమో. మొత్తానికి నానా తిప్పలూపెట్టి ఆ దంపతులకు మార్చి 7వతేదీ సోమవారం ఉదయం పత్రాలు అందజేసి వికటాట్టహాసం చేశాడట ఆ డామేజర్... కాదు కాదు.. మేనేజర్.

ఎవరైనా హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకుకి ఇంటి లోన్ కోసం వెళ్లాలనుకుంటే ఈ జితేందర్‌తో జాగ్రత్త. అన్నట్టు చెప్పలేదు కదూ ఆయన గారి పేరు జితేంద్ర. గృహ నిర్మాణదారులూ, కొనుగోలుదారులూ ఈ డామేజర్‌తో తస్మాత్ జాగ్రత్త...!

# విదేశీ యువతిపై అత్యాచార యత్నం


- మహిళా దినోత్సవం నాడే ఘాతుకం
- నెల్లూరు పరువుతీసిన నిందితులు
- గంటల వ్యవధిలోనే పట్టుకున్న పోలీసులు



అంతర్జాతీయ మహిళా దినోత్సవం నాడే నెల్లూరుజిల్లాలో ఘోరం జరిగింది. ఓ విదేశీ మహిళపై అత్యాచారయత్నం జరగడంతో జిల్లా పరువు కాస్తా పెన్నలో కలసిపోయింది. భారత దేశ పర్యటనకు వచ్చిన ఒక విదేశీ యువతిపై నెల్లూరు జిల్లాకు చెందిన ఇద్దరు యువకులు అత్యా చారయత్నానికి పాల్పడి నెల్లూరుకు అప్రతిష్ట తెచ్చారు. ఆ యువతి ఎలాగో వారి బారినుంచి తప్పించుకుని పోలీసు లకు ఫిర్యాదు చేయడంతో వెంటనే రంగం లోకి దిగిన పోలీసులు గంటల వ్యవధి లోనే ఆ దుండగుల్ని పట్టుకున్నారు. గూడూరు సిఐ శ్రీనివాసులురెడ్డి ఆ ఘటనను విలేకర్లకు వివరించారు. లూథి యానా దేశానికి చెందిన ఓ పర్యాటకు రాలు భారతదేశ పర్యటనకు వచ్చింది. శ్రీలంక నుంచి చెన్నైకి వచ్చి, అక్కడినుంచి గోవాకి వెళ్ళేం దుకు చెన్నై నుంచి బస్సులో బయలు దేరింది. అయితే ఆమెవద్ద ఇండియన్ కరెన్సీ లేకపోవడంతో డ్రైవర్ బస్సునుంచి దింపేశాడు. ఆ బస్సులోనే ఉన్న మనుబోలు మండలం వెంకన్నపాళెం గ్రామానికి చెం దిన ఇంగిలాల సాయికుమార్ అనే యువ కుడు ఆమెకు తనవద్ద ఉన్న డబ్బులిచ్చి పరిచయం చేసుకున్నాడు. గోవాకు తీసుకు వెళ్తానని నమ్మించి ఆమెను తమ స్వగ్రామ మైన బద్దెవోలు వెంకన్నపాళెంకు తీసుకు వచ్చాడు. గూడూరు రూరల్ పరిధిలోని శారదానగర్‌లో ఉన్న తన స్నేహితుడు షేక్ అబిద్‌తో కలసి ఆమెపై అత్యాచారానికి పథకం వేసుకున్నారు. కృష్ణపట్నం పోర్ట్ చూపిస్తామని నమ్మబలికి ఆమెను మోటార్ బైక్‌పై ఎక్కించుకుని సైదాపురం అటవీ ప్రాంతానికి తీసుకువెళ్ళి ఆమెపై అత్యా చారం చేయడానికి ప్రయత్నించడంతో ఆమె భయపడి పెద్దగా కేకలు వేస్తూ వారినుంచి తప్పించుకుని పరుగెత్తుకుంటూ రోడ్డువద్దకు వచ్చింది. అది గమనించిన స్థానికులు ఆమెను రక్షించి సైదాపురం పోలీస్‌స్టేషన్‌కు తీసుకువెళ్లారు. జిల్లా ఎస్పీ విజయారావు ఆదేశాలతో గూడూరు డిఎస్పీ రాజగోపాల్‌రెడ్డి, సిఐ శ్రీనివా సులురెడ్డి, సైదాపురం, గూడూరు రూరల్, మనుబోలు ఎస్‌ఐలు, సిబ్బంది హుటా హుటిన రంగంలోకి దిగి వారెక్కడున్నారో గాలించి గంటల వ్యవధిలోనే వారిని పట్టుకున్నారు. నిందితులైన సాయికుమార్, అబిద్‌లను చిల్లకూరు కూడలి వద్ద అరెస్ట్‌చేసి కేసు నమోదు చేశారు.

## 'శ్రీ సీతారామకల్యాణం' గ్రంథావిష్కరణ 12న

ప్రముఖ అవధాని కోట రాజశేఖర్ రచించిన 'శ్రీ సీతారామకల్యాణం' గ్రంథత్రయం ఆవిష్కరణ ఈనెల 12వ తేదీ నెల్లూరు బాలాజీనగర్‌లోని శ్రీ సీతారామస్వామి దేవ స్థానంలో జరుగనుందని నిర్వాహకులు తెలిపారు. పద్యసారస్వత పరిషత్ నెల్లూరు శాఖ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరుగుతుందని, సాహిత్యాభిమానులు, ఆధ్యాత్మికవేత్తలు పాల్గొని జయప్రదం చేయాలని వారు కోరారు.



Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Magunta Layout, NELLORE-3.
Cell: 9866314741. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Managing Editor : **T.BHARATHI REDDY,** Sub-Editor : **MADDURU SRINIVASULU.** e-mail: lawyerpatrika@gmail.com